



Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4781

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్






అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 29 | సోమవారం 07 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా..

- వాళ్లంతా బయటకొచ్చారు: ప్రధాని మోదీ
- 'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి మాత్రతో విమర్శకుల అసలు రంగు బయటపడిందన్న మోదీ
- గత ప్రభుత్వాల హయాంలోని వైఫల్యాలను విద్యార్థులకు వివరించిన ప్రధాని
- 2008 ఆర్థిక సంక్షోభం ఎదుర్కోవడంలో నాటి ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- కరోనా, యుద్ధం వంటి సంక్షోభాలను తన ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని వెల్లడి
- భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ఆశలు నెరవేరడం లేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలపై మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తాను గతంలో ప్రయోగించిన 'దిమాగీ నక్సల్' పదాన్ని పునరుద్ఘాటిస్తూ, అది ఒక హోమియోపతి మాత్రలా పనిచేసి విమర్శకుల అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ)

- మిగతా 2లో..

# నిన్న జెన్ జీ..నేడు జెన్ ఆల్ఫా

- స్కూళ్లు బాగుచేయండి.. టీచర్లు, గదులు, బెంచీలు లేవు
- తాగునీరు, కరెంట్ ఎక్కడ?
- సమస్యలపై వీధుల్లోకి చిన్నారులు
- ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కోసం దేశవ్యాప్త ఆందోళనలు
- మోడీ సర్కారును నిలదీస్తున్న కొత్తతరం

'ప్రశ్న'ను భవిష్యత్‌తరం బలోపేతం చేస్తుంది. ఇన్నేండ్లు ఏ ప్రశ్నను అయితే తొక్కిపెట్టి, నిరంకుశ పాలన కొనసాగిందో, ఇప్పుడు అదే ప్రశ్నను చిన్నారులు తమ భుజస్కందాలపై వేసుకుంటున్నారు. పెద్దలు అడగాల్సిన ప్రశ్నలను ఇప్పుడు చిన్నారులే నిలదీస్తున్నారు. పాఠశాల భవనం కూలిపోతుందనే భయంతో యూపీలో ఆరేండ్ల నుంచి పదేండ్లలోపు పిల్లలు తరగతులను బహిష్కరించి నిరసనకు దిగారు. ఒక చోట తాగునీరు లేదు.. మరోచోట విద్యుత్ లేదు.. ఇంకోచోట టీచర్లు లేరు.. మరొకచోట మధ్యాహ్న భోజనం నాసిరకం. దేశంలో 'జెన్ జీ' విద్యా సంస్కరణల కోసం గళమెత్తిన తర్వాత.. ఇప్పుడు 'జెన్ ఆల్ఫా' కూడా ప్రభుత్వ విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తూ ముందుకొస్తోంది. ఇప్పుడిది మోడీ సర్కారు మెడకు చుట్టుకుంటున్నది. ?

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

దేశంలో విద్యా వ్యవస్థపై కొత్త తరం అసంతృప్తి బహిరంగ నిరసనలుగా మారుతోంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కోసం చిన్నారులే తరగతులు బహిష్కరించి ఆందోళనలకు దిగుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. యూపీలోని ఓ గ్రామంలో 122 మంది విద్యార్థులు పాఠశాల కొత్త భవనం నిర్మించే వరకు తరగతుల్లోకి వెళ్లబోమని నిరసనకు దిగడం ఈ పరిస్థితికి నిదర్శనం. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఇలాంటి విద్యార్థుల నిరసనలు రోజురోజుకూ




పెరుగుతున్నా యి. యూపీలోని సముహీ భట్పుర్వా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గతనెల 22న సాధారణంగా తరగతులు ప్రారంభం కావాల్సిన సమయానికి 122 మంది విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లలేదు. చదువుకోవాల్సిన చిన్నారులే ఆ రోజు అధికారులకు 'పాఠం' చెప్పారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనం నిర్మించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. 2023లో పాఠశాల గోడ కూలి ఓ బాలిక తీవ్రంగా గాయపడినప్పటికీ భవనం మరమ్మతులు జరగలేదు. అప్పటి నుంచి కొత్త భవనం కోసం పిల్లలు

- మిగతా 2లో..



## నేపాల్ థేరాంగ్‌లో వరదలు

- కూలిన 4 ఇళ్లు, కొట్టుకుపోయిన వంతెన
- గత నెల వరదల్లో 1,344 మృతదేహాలు లభ్యం
- 5వేల మంది ఆచూకీ గల్లంతు
- 7,570 ఇళ్లు నేలమట్టం, కొట్టుకుపోయిన 55 కి.మీ. రహదారులు, కూలిన 105 వంతెనలు
- దొరికిన బంగారం, డబ్బు అప్పగించాలని పోలీసుల వార్నింగ్
- 400 బిలియన్‌ల నష్టం: ఎన్‌డీఆర్ఆర్ఎంఎ ప్రకటన

ఖాఠ్మాండు– సూర్య వాస్తవం

ఓ వైపు నేపాల్ వరద బీభత్సం ఇంకా మరిచి పోకముందే ఆదివారం గోర్ఖా జిల్లాలోని థేరాంగ్ నది(లో భారీ వరదలు సంభవించాయి. దీంతో థేరాంగ్ తీర ప్రాంతమైన బుధిగండకి ప్రాంతానికి అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ వరదలతో నాలుగు ఇళ్లు నేలమట్టం కాగా, ఒక వంతెన కొట్టుకుపోయిందని, ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. మరోవైపు ఆగస్ట్ 26న సంభవించిన వరదల్లో ఇప్పటివరకు 1,344 మృతదేహాలు లభ్యం కాగా, 5000వేల మంది ఆచూకీ గల్లంతైనట్లు ఎన్‌డీఆర్ఆర్ఎంఎ

- మిగతా 2లో..

# బీజేపీని ఓడించటమే లక్ష్యం

- ఆపార్టీకి మరో అవకాశం ఇవ్వం
- రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) కార్యాచరణ
- భయాన్ని ఛేదించిన జంతర్‌మంతర్ విద్యార్థి ఉద్యమం
- ప్రభుత్వానికి తలవంచక తప్పలేదు
- వ్యక్తిగత ప్రయోజనం కంటే పార్టీ ప్రయోజనమే ముఖ్యం
- తప్పులు, లోపాలను గుర్తించి సరిదిద్దుకుంటాం
- బలమైన కార్మికవర్గ విప్లవ పార్టీగా సీపీఐ(ఎం)ను తీర్చిదిద్దడమే లక్ష్యం
- పొలిట్‌బ్యూరో సమావేశ వివరాలు వెల్లడించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎమ్ఏ బేబీ



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ఉత్తరప్రదేశ్, పంజాబ్ సహా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, సంఘ్ పరివార్‌ను ఓడించడమే లక్ష్యంగా సీపీఐ(ఎం) పనిచేస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎమ్ఏ బేబీ స్పష్టం చేశారు. జంతర్‌మం తర్‌లో జరిగిన విద్యార్థి ఉద్యమంతో పాటు దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కనిపిస్తుందని చెప్పారు. రెండ్రోజులపాటు ఆపార్టీ కేంద్ర కార్యాలయం (ఏకేజీ భవన్)లో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశ వివరాలను ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. బీజేపీ, సంఘ్‌పరివార్ శక్తులను ఓడించేందుకు ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యతను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పంజాబ్ సహా బీజేపీని ఓడించే అవకాశాలు అత్యధికంగా ఉన్న అభ్యర్థికి సీపీఐ(ఎం) మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ అంశంపై పంజాబ్ రాష్ట్ర కమిటీ ఇప్పటికే సమగ్రంగా చర్చించిందనీ, అవసరమైన నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. ఉత్తర ప్రదేశ్‌లోనూ

- మిగతా 2లో..

# ఢిల్లీలో కుప్పకూలిన హాస్టల్ భవనం

- ముగ్గురు మృతి.. శిథిలాల కింద పలువురు
- సహాయ చర్యల్లో పాల్గొన్న పోలీసులు, ఫైర్ సిబ్బంది, డీడీఎంఏ, ఎన్‌డీఆర్ఎఫ్

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

దేశ రాజధానిలో ఘోర విషాదం జరిగింది. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలోని సత్య నికేతన్‌లో ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఇందులో బాలుర పీజీ వసతి గృహం నిర్వహిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. భవన శిథిలాల కింద పలువురు విదార్థులు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. శిథిలాల కింద ఎంతమంది చిక్కుకున్నారు, ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, బేస్‌మెంట్‌తో పాటు ఐదు అంతస్తులు ఉన్న ఈ భవనం సుమారు 50 ఏండ్ల క్రితం నాటిది.



ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు, నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో ఒక్కసారిగా భవనం కుప్పకూలింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో బేస్‌మెంట్‌లో నీరు చేరి పునాది బలహీనపడటంతోనే భవనం కూలిపోయి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియలేదు. భవనం కూలిన వెంటనే ఢిల్లీ పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఢిల్లీ ఫైర్ సర్వీస్, డీడీఎంఏ బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. అగ్నిమాపక

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# టీడీపీ నాయకత్వానికి కొత్త దిశ..

- చంద్రబాబు- లోకేశ్ సమక్షంలో లీడర్‌షిప్ కాంక్లేవ్
టీడీపీ నాయకత్వానికి కొత్త దిశ..
చంద్రబాబు- లోకేశ్ సమక్షంలో లీడర్‌షిప్ కాంక్లేవ్



అమరావతి– సూర్య వాస్తవం

రాజకీయాల్లో కొత్త నాయకత్వ విధానానికి తెలుగుదేశం పార్టీ (ఎఏశ్రీబస్త్రబ ఐఎయుఎ ౧ఖుఏఎ) శ్రీకారం చుడుతోంది. ప్రజాప్రతినిధులు, నియోజక వర్గ స్థాయి ముఖ్య ప్రతినిధులకు నాయకత్వ పటిమ పెంపొందించే అంశంపై రెండు రోజుల ట్రెనింగ్ కాంక్లేవ్‌ను టీడీపీ

- మిగతా 2లో..

# కాంగ్రెస్ పార్టీలో కలకలం..

- మాజీ ఎమ్మెల్యే సహా 18 మందికి నోటీసులు
- తెలంగాణ కాంగ్రెస్‌లో 18 మంది నేతలకు షోకాజ్ నోటీసులు
- పార్టీ సమావేశాల్లో గొడవలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చర్యలు
- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలకు నోటీసులు
- వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కమిటీ ఆదేశం

3లో



# నేపాల్ థేరాంగ్‌లో వరదలు

(మొదటిపేజీ తరువాయి)

(నేషనల్ డైజెస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ) ప్రకటించింది. 7,570 ఇళ్లు నేలమట్టం కాగా, 55 కి.మీ. రహదారులు పూర్తిగా కొట్టుకుపోయాయని, 105 వంతెనలు కూలిపోయాయని ప్రకటించింది. వరదలతో 1,806 హెక్టార్ల వ్యవసాయ భూమి, 13 జలవిద్యుత్ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లిందని 783 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని పేర్కొంది. ఈ సంస్థ ప్రాథమిక అంచనా ప్రకారం 400 బిలియన్ల నేపాలీ రూపాయల నష్టం వాటిల్లింది. నేపాల్ రెస్క్యూ బృందాలతోపాటు, అనేక దేశాల సహాయక బృందాలు ఆచూకీ గల్లంతైన వారి కోసం వెతుకుతున్నాయని తెలిపింది. వరదలతో నేపాల్ పర్యాటక రంగానికి అత్యధిక నష్టం వాటిల్లిందని పేర్కొంది.

# 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా..

(మొదటిపేజీ తరువాయి)

శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, తన ప్రభుత్వ పాలనను, గత ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ పదునైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఎర్రకోట నుంచి నేను చేసిన ప్రసంగం మీరు విని ఉండొచ్చు. నేను ఎర్రకోట నుంచి 'దిమాగీ నక్సల్' అనే ఒక హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతి సూత్రాల ప్రకారం, చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి మరింత తీవ్రమవుతుంది. అదే హోమియోపతి స్వభావం" అని వివరించారు.

"అదేవిధంగా, నేను 'దిమాగీ నక్సల్' పిల్ ఇవ్వగానే, దిమాగీ నక్సల్స్ ఒక్కొక్కరుగా బయటకు రావడం మొదలుపెట్టారు. ఈ వ్యాధిని ప్రోత్సహిస్తున్న వారి అసలు రంగును ఇప్పుడు ప్రజలు కూడా చూస్తున్నారు" అని అన్నారు. గతంలో దేశం ఎదుర్కొన్న సంక్షోభాలను నాటి ప్రభుత్వాలు ఎదుర్కొన్న తీరును ప్రధాని తీవ్రంగా విమర్శించారు. "నేను మీకు చాలా విషయాలు చెప్పాను. 'ఇదేంటి? ఇది 140 కోట్ల మంది ప్రజలున్న దేశం. ఇది చాలా సులభం. మోదీ కొత్తగా ఏం చేశారు?' అని కొందరు అనుకోవచ్చు. కానీ అది నిజంగా అంత సులభమా? నేను మిమ్మల్ని మరోసారి పాత రోజుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. 2013 నాటి కేదార్‌నాథ్ విపత్తును ప్రస్తావిస్తూ.. "అప్పుడు యావత్ ప్రభుత్వం కకావికలమైంది. ఏం చేయాలో, ఎలా స్పందించాలో వారికి తెలియలేదు" అని గుర్తుచేశారు. అదేవిధంగా 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అప్పటి ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోలేకపోయిందని విమర్శించారు. "2008లో బ్యాంకింగ్ సంక్షోభం వచ్చినప్పుడు, నాటి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆ సంక్షోభం చాటున దాక్కునే ప్రయత్నం చేసింది. దాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా వారికి లేదు. భారతదేశ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ పతనం అంచుకు నెట్టబడింది" అని ఆయన పేర్కొన్నారు.

తన ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ, వాటిని ఎలా ధైర్యంగా ఎదుర్కొన్నారో మోదీ వివరించారు. "మొదట ప్రపంచాన్ని స్తంభింపజేసిన కోవిడ్-19 మహమ్మారి వచ్చింది. ఆ తర్వాత రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైంది. వాణిజ్యం, సరఫరా గొలుసులు ఆయుధాలుగా మారాయి. పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తింది. ప్రతీసారి 'ఇక భారత్ నిలబడదు' అని అన్నారు. నన్ను నా అతిపెద్ద ఆరాధకులు (విమర్శకులు) అయితే 'ఇప్పుడు మోదీ చిక్కుకున్నాడు, పడిపోయాడు, ఇక అతన్ని అణిచివేస్తారు' అని సంతోషించారు. కానీ, నా దేశ ప్రజల ఆశీర్వాదాలకు ఎంత శక్తి ఉందంటే, భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ప్రతి కోరిక నెరవేరడం లేదు" అని మోదీ వ్యాఖ్యానించారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మోదీ ఎస్ఆర్‌సీసీని సందర్శించారు. అప్పుడు విద్యార్థులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు ప్రధాని హోదాలో అదే వేదికపై నుంచి ప్రసంగించడం గమనార్హం.

# టీడీపీ నాయకత్వానికి కొత్త దిశ..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తోంది. ఈ నెల 7, 8వ తేదీల్లో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌ను నిర్వహించనుంది. రెండు రోజుల్లో 10 సెషన్లల్లో ఈ కాంక్లేవ్ జరగనుంది. ట్రైనింగ్ - ఇంటరాక్టివ్ విధానంలో లీడర్‌షిప్ కాంక్లేవ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు (జష్ట్రుఅంతీుఎ్ఘుఎబ చీుఱఅబ) ఆదేశించారు. క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేలా కాంక్లేవ్ నిర్వహించేలా ఏపీ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రణాళికలు రచించారు.

**పురుషాంగాల దొంగలంటూ..ప్రతిపక్ష హోదా అపహాస్యం**

ఈ కాంక్లేవ్‌కు చంద్రబాబు, లోకేశ్ హాజరు కానున్నారు. క్షేత్రస్థాయి యంత్రాంగం, కేడర్ సమన్వయం, పొలిటికల్ రెస్పాన్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్ వంటి అంశాల్లో నేతల సామర్థ్యాలను మెరుగుపరిచేలా రెండు రోజుల పాటు ట్రైనింగ్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వం - ప్రజలకు వారధిగా పార్టీ నేతలు ఉండాలని చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో చంద్రబాబు అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వం - టీడీపీ చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం... ప్రత్యర్థి పార్టీల కుట్రలను ఎండగట్టడం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో కీలకంగా చర్చించనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా ముఖ్య నేతలు హాజరు కానున్నారు. మొదటి రోజున నాయకత్వ అభివృద్ధి, నాయకులను తీర్చిదిద్దడం, సరైన స్థానంలో నిలబెట్టడం - పార్టీ సంస్థాగత నిర్మాణం, అజెండా, పనితీరు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం - స్వర్ణాంధ్ర విజన్ - రాజకీయ, ఆర్థిక సాధికారత - సంపూర్ణ సంక్షేమం, సాధికారత అంశాలపై చంద్రబాబు, లోకేశ్ మార్గనిర్దేశం చేయనున్నారు. రెండో రోజున సుస్థిర అభివృద్ధి, ప్రజా సేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యూనికేషన్ - ప్రజలకు సేవల చేరువ, ఎల్‌నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత అంశాలపై చంద్రబాబు, లోకేశ్ దిశానిర్దేశం చేయనున్నారు.

# ఎన్టీఆర్ ట్రస్టు సీవోవోకు లోకేశ్ పరామర్శ

**తిరుపతి- సూర్య వాస్తవం :**

ఎన్టీఆర్ ట్రస్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో) అడుసుపల్లి గోపీని మంత్రి లోకేశ్ ఆదివారం పరామర్శించారు. తిరుపతి జిల్లా పాకాల మండలం అడుసుపల్లెకు చెందిన గోపి తండ్రి ఆంజనేయులు నాయుడు ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో గోపి నివాసానికి సాయంత్రం వచ్చిన లోకేశ్ ఆయనతో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆంజనేయులు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అక్కడి నుంచి చిత్తూరు వెళ్లిన లోకేశ్ ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకుడు వసంతకుమార్ ఇంటికి వెళ్లారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. లోకేశ్ వెంట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేశ్, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్, కె.మురళీమోహన్, వీఎం థామస్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఉన్నారు.

# నిన్న జెన్ జీ..నేడు జెన్ ఆల్ఫా

(మొదటిపేజీ తరువాయి)

కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదని విద్యార్థులు తెలిపారు.

**పేద పిల్లలే చదువుతున్నందుకే...**

విద్యా హక్కుల కార్యకర్త నాగసింహారావు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు అడుగుతున్నవి పెద్ద పెద్ద సౌకర్యాలు కాదని అన్నారు. టీచర్లు, బెంచీలు, పాఠశాల భవనాలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సౌకర్యాలే కావాలని కోరుతున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలే చదువుతున్నారని ఆయన గుర్తుచేశారు. పేద పిల్లలు చదువుతున్నందుకే సర్కారు స్కూళ్లలో ఈ దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**టీచర్లు.. బెంచీలు లేవు**

బీజేపీ పాలిత రాష్ట్రం యూపీలోని సర్వోదయ ఇంటర్ కాలేజీలో జులై 28న విద్యార్థులు మరో నిరసన చేపట్టారు. 12వ తరగతి వరకు బోధించే ఈ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, బెంచీలు వంటి కనీస సదుపాయాలు కూడా లేవని విద్యా ర్థులు ఆరోపించారు. వేసవిలో విద్యుత్ లేక ఫ్యాన్లు పనిచేయవని, తాగడానికి నీరు లేదని, బెంచీలు సరిపోక చాలామంది నేలపై కూర్చోవాల్సి వస్తోం దని 12వ తరగతి విద్యార్థి మనోజ్ తెలిపాడు.

**మహారాష్ట్రలో టీచర్ల కొరత**

మహారాష్ట్రలోని పార్లీ ప్రాంతంలోని వైద్యనాథ్ విద్యాలయంలో జులై 31న విద్యార్థులు ఉపాధ్యాయుల కొరతకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. 1941లో స్థాపించిన ఈ పాఠశాలలో సిబ్బంది కొరత తీవ్ర సమస్యగా ఉంది.

**మధ్యాహ్న భోజనం నాసిరకం**

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత కూడా విద్యార్థుల నిరసనలకు కారణమవుతోంది. బీజేపీ అధికారంలో ఉన్న మరో రాష్ట్రం బీహార్‌లోని సిముయారా గ్రామంలో జులై 28న సుమారు 50 మంది విద్యార్థులు నాలుగు కిలోమీటర్లు నడిచి ఓ ఉన్నతాధికారిని కలిశారు. పాఠశాలలో పైపుల ద్వారా నీటి సరఫరా లేకపోవడంతో వంటకు ఉపయోగించే ముడి పదార్థాలను కూడా సరిగా శుభ్రం చేయలేకపోతున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. బియ్యం, పప్పులు, కూరగాయలు నాసిరకంగా ఉంటున్నాయని.. కొన్ని సందర్భాల్లో కూరగాయలు దాదాపు కుళ్లిపోయిన స్థితిలో ఉంటున్నాయని వారు ఆరోపించారు.

**మోదీ ప్రభుత్వానికి సవాలు**

దేశ జనాభాలో 30 శాతానికి పైగా 18 ఏండ్లలోపు వారే ఉన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో తమ హక్కుల కోసం గళమెత్తుతున్న పిల్లల్లో చాలామంది 2029 నాటికి ఓటు హక్కు పొందే వయసుకు చేరుకుంటారు. "ఈ పిల్లలే రేపటి ఓటర్లు. వారికి మంచి విద్య అందకపోతే దేశ అభివృద్ధి దెబ్బతింటుంది" అని పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యా హక్కుల కార్యకర్త ఆకాశ్ సర్కార్ అన్నారు.

**చిన్నారుల ప్రశ్న.. ప్రభుత్వానికి పరీక్ష**

దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో పేరుకుపోయిన అసంతృప్తి ఒక్కసారిగా బయటకు రాలేదని బెంగళూరు విశ్వవిద్యాలయంలో చదువుతున్న సుజాత గౌడ అభిప్రాయపడ్డారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను సమూలంగా మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. చిన్నారుల ప్రశ్నలు, ప్రభుత్వాలకు పరీక్షలే అని తేల్చిచెప్పారు.

**ఒక్క టీచర్‌తోనే పాఠశాలలు**

భారత్‌లో 1,00,843 పాఠశాలల్లో అన్ని తరగతులకూ కలిపి ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నట్టు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తున్నది. ఈ పాఠశాలల్లో సుమారు 29 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. అలాగే, దేశంలో 5,663 'ఘోస్ట్ స్కూళ్లు' (అంటే విద్యార్థులే లేని పాఠశాలలు) కూడా ఉన్నాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి.

**భయం..భయం**

ఎనిమిదేండ్ల ప్రియ తన పాఠశాల భవనం పరిస్థితిపై భయపడుతున్నామని తెలిపింది. భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న ఆందోళన చదువుపై దృష్టి పెట్టనివ్వడం లేదని చెప్పింది. అందుకే తామంతా నిరసనకు దిగామని వివరించింది. ఇది ఈ ఒక్క పాఠశాల సమస్య కాదు. మహారాష్ట్ర, బీహార్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా జులై నుంచి విద్యార్థుల నిరసనలు జరుగుతూనే ఉన్నాయి.

**ఇక్కడా అంకెల గారడీనే..**

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద పాఠశాల వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. దేశంలో సుమారు 15 లక్షల పాఠశాలల్లో 24.7 కోట్ల మంది విద్యార్థులు చదువుతున్నారని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. వీటిలో దాదాపు 70 శాతం పాఠశాలలు కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల ఆధీనంలో ఉన్నాయి. 2025-26 ప్రభుత్వ ఆడిట్ ప్రకారం విద్యకు యాక్సెస్ పెరిగిందనీ, ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి మెరుగుపడి ప్రతి 24 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. పాఠశాల మానేసే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గుతోందని అధికారిక సమాచారం. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉందని విద్యా హక్కుల కార్యకర్తలు చెప్తున్నారు. కొన్ని పాఠశాలలు పశువులను పెంచే ప్రదేశాలుగా కూడా ఉపయోగిస్తున్న పరిస్థితి ఉందని ఉదాహరణలు చూపిస్తున్నారు.

# బీజేపీని ఓడించటమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీని ఓడిం చేందుకు సీపీఐ(ఎం) పనిచేస్తుందన్నారు.

**విద్యార్థులు భయపడకుండా మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.**

మోడీ ప్రభుత్వం, సంఘ్‌పరివార్ కొంతకాలంగా దేశంలో సృష్టిస్తున్న భయానక వాతావరణాన్ని జంతర్‌మంతర్ విద్యార్థి ఉద్యమం బద్దలు కొట్టిందని ఎమ్ఏ బేబీ చెప్పారు. ఎలాంటి భయానికీ లొంగకుండా విద్యార్థులు మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారని గుర్తుచేశారు. విద్యార్థి ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పలేదన్నారు. సీజేపీ, ఎస్ఎఫ్ఐతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు జంతర్‌మంతర్ ఉద్యమానికి నాయకత్వం వహించాయని చెప్పారు. ఈ ఉద్యమానికి ప్రజల నుంచి పెద్దఎత్తున మద్దతు లభించిందన్నారు. బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నికలో బీజేపీకి ఎదురైన ఓటమి కూడా జంతర్‌మంతర్ ఉద్యమ ప్రభావానికి నిదర్శనమని అన్నారు.

**రైతు, కార్మిక ఉద్యమాలతో...**

గత లోక్‌సభ ఎన్నికలకు ముందు రైతులు, కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించాయని గుర్తుచేశారు. ఉద్యమాలు బలంగా సాగిన ప్రాంతాల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలిందని, స్వల్ప మెజారిటీతోనే ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న బీజేపీకి మరో అవకాశం ఇవ్వడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడంతో పాటు వాటి ప్రభావాన్ని ఎన్నికల రాజకీయాల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**పార్టీ ప్రయోజనాలే ముఖ్యం**

పార్టీ రాజ్యాంగం ప్రకారం వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలను ఉన్నతంగా ఉంచడమే సీపీఐ(ఎం) సభ్యులు పాటించాల్సిన నిబంధన అని ఎమ్ఏ బేబీ తెలిపారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక తదితర అంశాల్లో అభిప్రాయ భేదాలు, ఫిర్యాదులు ఉండవచ్చనీ, వాటిని సంబంధిత పార్టీ కమిటీలు, వేదికల్లోనే ప్రస్తావించి అంతర్గత చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఫిర్యాదులు, మనోవేదనల పేరుతో పార్టీకి వ్యతిరేకంగా ఓటేసే స్థాయికి వెళ్లడం సరికాదన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పార్టీకి అండగా నిలవాల్సిన బాధ్యత నుంచి వైదొలగడం తప్పేనని అన్నారు. కేరళతోపాటు పలు ప్రాంతాల్లో పార్టీ నేతలు ఇదే విషయాన్ని స్పష్టం చేశార న్నారు. పార్టీకి ఓటు వేయకుండా ప్రత్యర్థులకు ఓటేసిన వారు తమ తప్పును గ్రహించాలని సూచించారు.

**తప్పులు దిద్దుకుంటాం**

కేరళ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై పార్టీ అవసరమైన సమీక్ష నిర్వహిస్తుందని బేబీ తెలిపారు. ఈ పరిశీలన జిల్లా స్థాయి నుంచే ప్రారంభమవుతుందని చెప్పారు. కన్నూరు జిల్లా కమిటీ ఇప్పటికే అవసరమైన సమీక్ష నిర్వహించిందనీ, అభ్యర్థుల ఎంపికలో తప్పులు జరిగాయని గుర్తించిందన్నారు. తప్పులు, పొరపాట్లు జరిగితే వాటిని అంగీకరించి, వాటి నుంచి పాఠాలు నేర్చుకుని సరిదిద్దుకునే పార్టీ సీపీఐ(ఎం) అని స్పష్టం చేశారు.

**పునరుద్ధరణకు అంతర్గత చర్చలు**

కేరళలో జరగనున్న రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ తప్పులు, లోపాలను సరిదిద్దుకుని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు విస్తృతంగా చర్చిస్తామని ఎమ్ఏ బేబీ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోనూ ఇదే తరహాలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించామని చెప్పారు. సమావేశంలో ప్రవేశపెట్టే నివేదిక ఆధారంగా చర్చ, విమర్శ, ఆత్మ విమర్శ జరుగుతాయన్నారు. పార్టీ పునరుద్ధరణకు అవసరమైన అంతర్గత ప్రక్రియ ప్రస్తుతం జరుగు తోందనీ, దిద్దుబాటు అనేది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. పార్టీని బలోపేతం చేసేందుకు శాఖ స్థాయి నుంచి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరుగుతుం దన్నారు. సీపీఐ(ఎం)ను బలమైన కార్మికవర్గ విప్లవ పార్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యమనీ, ప్రతి పార్టీ సభ్యుడు అందుకు అవసరమైన కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

**పార్లమెంటరీ భ్రమపై లోతైన సమీక్ష**

సవరణ పత్రంలో భాగంగా పార్లమెంటరీ భ్రమ, ప్రజలతో సంబంధాల కొరత, సమిష్టి కార్యాచరణ అనే మూడు అంశాలపై పొలిట్‌బ్యూరోలో విస్తృత చర్చ జరిగిందని బేబీ తెలిపారు. ప్రతి పొలిట్‌బ్యూరో సభ్యుడు ఈ మూడు అంశాలపై స్వీయ అంచనా నివేదిక సమర్పించారని చెప్పారు. పార్టీ పార్లమెంటరీ భ్రమకు లోనైందా? ప్రజలతో ఎంతమేరకు మమేకమవుతోంది? సమిష్టి కార్యాచరణ ఎంతవరకు సాధ్యమవుతోంది? అనే అంశాలపై లోతుగా సమీక్షించారని తెలిపారు. సవరణలో భాగంగా ఇలాంటి చర్చలు ఇతర పార్టీ కమిటీల్లోనూ జరుగుతాయని చెప్పారు. అవసరమైన సవరణలు చేపడుతూ పార్టీ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

# ఢిల్లీలో కుప్పకూలిన హాస్టల్ భవనం

(మొదటిపేజీ తరువాయి)



వాహనాలు, క్యాట్స్ అంబులెన్సులను రంగంలోకి దించారు. రెస్క్యూ బృందాలు శిథిలాలను తొలగిస్తూ బాధితుల కోసం గాలింపు చేపట్టాయి. ఇప్పటివరకు 8 మందిని బయటకు తీసినట్టు పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు ఆస్పత్రికి తరలించే సమయానికే మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. రెస్క్యూ చర్యల్లో గాయపడిన ఓ సిబ్బందికి చికిత్స అందించి డిశ్చార్జి చేశారు. 40 నుంచి 50 మంది వరకు శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని వారు అంచనా వేస్తున్నారు. 40 నుంచి 50 మంది వరకు శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని వారు అంచనా వేస్తున్నారు.

**విద్యార్థులతో నిండే ప్రాంతం**

సత్య నికేతన్ ప్రాంతంలో ఇరుకైన వీధుల వెంట అనేక పీజీ వసతులు, హోటళ్లు, తినుబండారాల దుకాణాలు ఉన్నాయి. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన పలు కళాశాలలు సమీపంలోనే ఉండటంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఇక్కడ నివసిస్తుంటారు. స్థానిక ఢిల్లీ పోలీసు సిబ్బంది రాజెన్ ఛెత్రి తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనంలో సుమారు 15 గదులు ఉండేవి. ఒక్కో గదిలో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు ఉండేవారు. కేరళ, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఇక్కడ ఉండేవారని తెలిపారు. మోతీలాల్ నెహ్రూ కాలేజ్, ఆత్మారామ్ సనాతన్ ధర్మ కాలేజ్, శ్రీ వెంకటేశ్వర కాలేజీల్లో చదివే విద్యార్థులు ఈ పీజీలో ఉండేవారని, ఒక్కో బెడ్‌కు సుమారు రూ.12 వేల వరకు అద్దె చెల్లించేవారని చెప్పారు. ప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, లెఫ్టినెంట్ గవర్నర్ తారన్‌జీత్ సింగ్ సంధు, పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఎంపీ బాన్సురీ స్వరాజ్ ఘటనాస్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పక్కనే ఉన్న భవనాన్ని ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఢిల్లీ సీఎంతో పాటు పోలీస్ కమిషనర్, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ జనరల్‌తో మాట్లాడి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నట్టు తెలిపారు.

# ఎన్టీఆర్ భరోసా.. కొత్త పెన్షన్లకు తెర!

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ.. 16 వరకు అవకాశం
- ఇంటి వద్దే అర్హతల పరిశీలన – ఈ-కేవైసీ తప్పనిసరి
- ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌ది సిఫారసు మాత్రమే.. తుది మంజూరు రాష్ట్ర స్థాయిలోనే




**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు సంబంధించి కొత్త దరఖాస్తుల స్వీకరణకు మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హులైన కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందించే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. అర్హత కలిగిన వారు తమ గ్రామంలోని స్వర్ణ గ్రామం కార్యాలయం లేదా పట్టణంలోని స్వర్ణ వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, సంబంధిత కేటగిరీకి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేస్తారు.

**ఇంటి వద్దకే అధికారులు.. అర్హతల తనిఖీ**

దరఖాస్తుల స్వీకరణ అనంతరం ముందుగా సాధారణ అర్హతలను పరిశీలిస్తారు. ప్రాథమికంగా అర్హత సాధించిన దరఖాస్తులను భౌతిక పరిశీలనకు పంపిస్తారు. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సమర్పించిన పత్రాలు, వాస్తవ అర్హతలను పరిశీలిస్తారు. అవసరమైతే అక్కడికక్కడే ఈ–కేవైసీ ప్రక్రియను కూడా పూర్తి చేస్తారు. భౌతిక పరిశీలన అనంతరం ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ దరఖాస్తులను పరిశీలించి అర్హత, అనర్హతపై నిర్ణయం తీసుకుని అర్హులైన దరఖాస్తులను తదుపరి ప్రక్రియకు సిఫారసు చేస్తారు.

**పింఛన్ మంజూరు వారి చేతుల్లో లేదు!**

ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ నేరుగా పింఛన్ మంజూరు చేయరని ప్రభుత్వం స్పష్టం చేసింది. స్థానిక స్థాయిలో అర్హులైన దరఖాస్తులను మాత్రమే సిఫారసు చేస్తారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో సెర్ప్, ఆర్టీజీఎస్, సంబంధిత శాఖలు తుది పరిశీలన చేపడతాయి. అర్హులైన లబ్ధిదారుల వివరాల ఆధారంగా సెర్ప్ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ప్రభుత్వం అనుమతి ఇచ్చి, అవసరమైన బడ్జెట్ అందుబాటులోకి వచ్చిన తర్వాతే పింఛన్ మంజూరు చేసి విడుదల చేస్తారు.

**మంజూరు చేసిన నెల నుంచే పింఛన్.. బకాయిలు ఉండవు**

కొత్తగా మంజూరయ్యే పింఛన్ సెర్ప్ మంజూరు చేసి విడుదల చేసే నెల నుంచే చెల్లుబాటు అవుతుంది. దరఖాస్తు చేసిన తేదీ నుంచి లేదా అర్హత పొందిన తేదీ నుంచి గత కాలానికి సంబంధించిన బకాయిలను చెల్లించరు. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు స్పష్టంగా తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వృద్ధాప్యం, వితంతువు, ఒంటరి మహిళలు, వికలాంగులు సెర్ప్ చేనేత కార్మికులు , జౌళి శాఖ, మత్స్యశాఖ డప్పు కళాకారులు సాంఘిక సంక్షేమ శాఖ, సంప్రదాయ చెప్పుల తయారీదారులు సాంఘిక సంక్షేమ శాఖ, ట్రాన్స్‌జెండర్లు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, కల్లు గీత కార్మికులు నిషేధ, ఆబ్కారీ శాఖ అన్ని కేటగిరీలకు ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, సంబంధిత ఇతర ధ్రువీకరణ పత్రాలు అవసరం.

**వృద్ధాప్య పింఛన్‌కు:** ఆధార్‌లోని వయస్సు రుజువు.
**వితంతువు పింఛన్‌కు:** భర్త మరణ ధ్రువీకరణ పత్రం, భర్త ఆధార్ నంబర్.
ఒంటరి మహిళలకు: వివాహం జరిగి ఉంటే కోర్టు విడాకుల తీర్పు; అవివాహిత అయితే తహసీల్దార్ జారీ చేసే వివాహం కాలేదనే ధ్రువీకరణ పత్రం.
**వికలాంగులకు:** కనీసం 40 శాతం బెంచ్‌మార్క్ వైకల్యం ఉన్న సదరం ధ్రువీకరణ పత్రం.
**చేనేత కార్మికులకు:** చేనేత, జౌళి శాఖ ధ్రువీకరణ పత్రం.
**మత్స్యకారులకు:** మత్స్యశాఖ ధ్రువీకరణ పత్రం.
డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులకు: సాంఘిక సంక్షేమ శాఖ ధ్రువీకరణ పత్రం.
**కల్లు గీత కార్మికులకు:** నిషేధ, ఆబ్కారీ శాఖ ధ్రువీకరణ పత్రం.
ట్రాన్స్‌జెండర్లకు: జిల్లా వైద్య మండలి ధ్రువీకరణ పత్రం.
సెప్టెంబర్ 7--16: దరఖాస్తుల స్వీకరణ, ఈ–కేవైసీ
సెప్టెంబర్ 17--21: సాధారణ అర్హత, భౌతిక/శాఖాపరమైన పరిశీలన
సెప్టెంబర్ 22--24:ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్ పరిశీలన, సిఫారసు
సెప్టెంబర్ 25--26:బడ్జెట్ ప్రతిపాదన, ప్రభుత్వ అనుమతి

**దరఖాస్తు నుంచి పింఛన్ వరకు.. ఇదే మార్గం!**

దరఖాస్తు , ఈ–కేవైసీ , అర్హత పరిశీలన , ఇంటి వద్ద భౌతిక తనిఖీ , ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్ సిఫారసు , రాష్ట్ర స్థాయి పరిశీలన , సెర్ప్ బడ్జెట్ ప్రతిపాదన , ప్రభుత్వ అనుమతి, పింఛన్ మంజూరు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ నిర్దేశిత గడువులో దరఖాస్తు చేసుకుని, అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# సూపర్ ఎల్‌నినో ప్రభావం...

- ఉమ్మడి జిల్లాను కమ్ముకుంటున్న కరవు ఛాయలు...!
- 100 మీటర్లకు దిగువకు పడిపోయిన భూగర్భ జలమట్టం
- వెయ్యి అడుగులు తవ్వినా నీటి జాడ లేని దుస్థితి
- పంటలు ఎండిపోతుండటంతో పశు గ్రాసంగా మారుతున్న వైనం
- ట్యాంకర్లతో నీరు కొనుగోలు చేస్తున్న రైతులు
- వర్షం కోసం ఆకాశం వైపు.. సాయం కోసం ప్రభుత్వం వైపు



**అనంతపురం – సూర్య వాస్తవం :** సూపర్ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పులతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరవు ఛాయలు క్రమంగా ముదురుతున్నాయి. ఒకవైపు వర్షాలు సకాలంలో కురవక పంటలు ఎండిపోతుండగా.. మరోవైపు భూగర్భ జలమట్టాలు పాతాళానికి పడిపోతుండటం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం 100 మీటర్లకు దిగువకు పడిపోయినట్లు రైతు వర్గాలు చెబుతున్నాయి. గతంలో వందల అడుగుల లోతులో నీరు లభించిన ప్రాంతాల్లోనూ ప్రస్తుతం మరింత లోతుకు బోర్లు వేసినా నీటి జాడ కనిపించకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**కరవు కోరల్లో అనంత రైతాంగం**

వర్షాధార వ్యవసాయంపైనే అధికంగా ఆధారపడే అనంత రైతాంగానికి వర్షాభావం తీవ్ర నష్టాన్ని మిగుల్చుతోంది. జిల్లాలో ప్రధానంగా సాగయ్యే వేరుశనగ, కంది, పత్తి తదితర పంటలకు కీలక దశలో తగినంత వర్షం లేకపోవడంతో మొక్కలు వాడిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు వాటిని పశువులు, గొర్రెలకు మేతగా వదిలేస్తున్నారు. మరికొందరు పంటలను దున్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల కోసం పెట్టిన పెట్టుబడులు చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

**ఈ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం**

అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం, శెట్టూరు, యాడికి, పుట్లూరు, ముదిగుబ్బ, కనగానపల్లి తదితర ప్రాంతాల్లో కరవు ప్రభావం పెరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఉరవకొండ ప్రాంతంలో కంది, వేరుశనగ పంటలు వర్షాభావంతో ఎండిపోతున్నాయి.శ్రీసత్యసాయి జిల్లాలో అగళి, గుడిబండ, అమరాపురం, నల్లమాడ తదితర మండలాల్లోనూ భూగర్భ జలాల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. బోర్లు, బావులపై ఆధారపడుతున్న రైతులకు నీటి లభ్యత రోజురోజుకూ తగ్గుతోంది.

**ట్యాంకర్లతో పంటలకు నీరు**

పెద్దవడుగూరు మండలంలో పత్తి సాగు చేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పొలాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో పంటను ఎలాగైనా కాపాడుకోవాలనే ఉద్దేశంతో అదనపు ఖర్చును భరిస్తున్నారు. గార్లదిన్నె మండలంలో పండ్ల తోటల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారింది. నీటి వనరులు తగ్గిపోవడంతో తోటలకు అవసరమైన నీటిని అందించడం రైతులకు సవాల్‌గా మారింది.



**పచ్చదనం మాయం.. జలాశయాలు వెలవెల**

వర్షాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పచ్చదనం క్రమంగా కనుమరుగవుతోంది. గతంలో పంటలతో కళకళలాడిన పొలాలు ఇప్పుడు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా తీవ్రమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

**పశుగ్రాసం కొరతతో పాడి రైతులపై భారం**

కరవు ప్రభావం పశుపోషణపైనా పడుతోంది. పశువులు, గొర్రెలు, మేకలకు తాగునీరు, పశుగ్రాసం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా గ్రాసం లభించకపోవడంతో పాడి రైతులు సుదూర ప్రాంతాల నుంచి వేరుశనగ గ్రాసాన్ని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. దీంతో ఇప్పటికే పంట నష్టాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులపై పశుపోషణ ఖర్చు మరింత భారంగా మారుతోంది. కొందరు రైతులు పశువులను పోషించలేక నష్టానికే విక్రయించుకుంటున్న పరిస్థితి నెలకొంది.

**ఐదు లక్షల హెక్టార్ల నుంచి 90 వేలకే?**

ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు సుమారు 5 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగు జరిగేదని రైతు వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆ విస్తీర్ణం సుమారు 90 వేల హెక్టార్లకు పరిమితమైనట్లు పేర్కొంటున్నారు. సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో పంట అవశేషాలు, స్థానికంగా లభించే పశుగ్రాసం కూడా తగ్గిపోయిందని రైతులు అంటున్నారు.

**ముందస్తు చర్యలపై రైతుల ఆశలు**

భూగర్భ జలమట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్న నేపథ్యంలో అధికారులు మండలాల వారీగా పరిస్థితిని శాస్త్రీయంగా అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు, చెక్‌డ్యామ్‌లు, కుంటల పునరుద్ధరణ, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, భూగర్భ జలాల రీచార్జ్ చర్యలను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ సూచనలు ఇవ్వడంతో పాటు.. పంట నష్టాల అంచనా, పశుగ్రాసం, తాగునీరు, సాగునీటి వనరుల నిర్వహణపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.వర్షం కోసం ఆకాశం వైపు.. సాయం కోసం ప్రభుత్వం వైపు అన్నట్లుగా అనంత రైతాంగం ఎదురుచూస్తోంది. వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రం కాకముందే అధికారులు అప్రమత్తమై సమగ్ర కరవు నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# కాంగ్రెస్ పార్టీలో కలకలం..

**హైదరాబాద్– సూర్య వాస్తవం :**

తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడిన నేతలపై పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలకు సిద్ధమైంది. పార్టీ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన 18 మంది నాయకులకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆదివారం గాంధీభవన్‌లో కమిటీ చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. నోటీసులు అందుకున్న నేతలు వారం రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని కమిటీ ఆదేశించింది. ఆదిలాబాద్, గజ్వేల్, సిరిసిల్ల, కరీంనగర్ నియోజకవర్గాల్లో ఇటీవల పార్టీ అంతర్గత సమావేశాల్లో జరిగిన వివాదాలు, ఇతర అవాంఛనీయ ఘటనలపై అందిన ఫిర్యాదులను కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ఈ చర్యలు చేపట్టింది. నోటీసులు అందుకున్న వారిలో గజ్వేల్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డి వంటి కీలక నేతలు ఉన్నారు. వీరితో పాటు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కంది శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డిలకు కూడా నోటీసులు జారీ అయ్యాయి. పెద్దపల్లి ఎంపీ వంశీ కారుపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఆరుగురిపై, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సింగితం శ్రీనివాస్ అందజేసిన ఫిర్యాదు మేరకు మరో ఏడుగురిపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించారు. కరీంనగర్‌కు చెందిన మూల లక్ష్మికి కూడా నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ.. పార్టీ నియమావళిని తాను ఎన్నడూ ఉల్లంఘించలేదని, ఎవరిపైనా కక్ష సాధింపు ధోరణితో నివేదికలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కేవలం పార్టీలో క్రమశిక్షణను కాపాడటంలో భాగంగానే ఈ నోటీసులు జారీ చేసినట్లు ఆయన వివరించారు.

# ఉద్యోగం ఉన్నంత మాత్రాన వైకల్యం తక్కువైనట్లు కాదు

- రోడ్డు ప్రమాద బాధితురాలికి రూ.3,77,84,297 చెల్లించాల్సిందే - బీమా కంపెనీని ఆదేశించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :** రోడ్డు ప్రమాద నష్టపరిహార కేసుల్లో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధితుల సంపాదన సామర్థ్యాన్ని కేవలం వారు ప్రస్తుతం ఉద్యోగంలో కొనసాగుతున్నారనే కోణంలో అంచనా వేయరాదని స్పష్టం చేసింది. బహిరంగ, పోటీ మార్కెట్‌లో వారి వాస్తవ సంపాదన సామర్థ్యాన్ని బట్టే వైకల్యాన్ని లెక్కించాలని తేల్చిచెప్పింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, వంద శాతం వైకల్యానికి గురైన ఓ మహిళకు పరిహారాన్ని గణనీయంగా పెంచింది. 7.5% వార్షిక వడ్డీతో కలిపి మొత్తం రూ.3,77,84,297 చెల్లించాలని ఆదేశించింది. 2011లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐబీఎం గ్రూప్ మేనేజర్ ప్రియాంక దాస్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం కారణంగా తీవ్రమైన ఆరోగ్య స మస్యలను ఎదుర్కొన్నారు. కానీ, ఆమె అదే సంస్థలో ఉద్యోగంలో కొనసాగుతుండడంతో కిందిస్థాయి ట్రై బ్యునల్ ఆమె వైకల్యాన్ని 60శాతంగా, హైకోర్టు 80 శాతంగా అంచనా వేశాయి. బీమా కంపెనీ మాత్రం ఆమె ఉద్యోగంలో కొనసాగుతున్నారన్న వాదనను తెరపైకి తెచ్చింది. అయితే, బాధితురాలి తరపు వాదనలను పరిశీలించిన జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, జస్టిస్ ఎన్.వి.అంజరియాల ధర్మాసనం బీమా కంపెనీ వా దనను తోసిపుచ్చింది. బాధితురాలు కేవలం యాజమాన్యం కల్పించిన అసాధారణ వెసులుబాట్ల వల్ల మాత్రమే ఉద్యోగంలో నెట్టుకొస్తున్నారని పేర్కొంది. హైకోర్టు అంచనా వేసిన 80 శాతం వైకల్యాన్ని 100 శాతానికి సవరిస్తూ.. భవిష్యత్తు నష్టంతో పాటు వైద్య ఖర్చులు, అటెండెంట్ చార్జీలు, ఇతర నష్టపరిహారాలను కలిపి మొత్తం రూ.3,77,84,297 చెల్లించాలని తుది తీర్పు వెలువరించింది

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి.....



**రాయదుర్గం - సూర్య వాస్తవం:** గుండ్లపల్లి క్రాస్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. రాయదుర్గం అర్బన్ సీఐ దేవానంద్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురానికి చెందిన జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు అభిరామ్, రామ్‌చరణ్, గోపాల్ శనివారం పాఠశాల ముగిసిన అనంతరం కాశీపురంలో తమ స్నేహితుడిని కలుసుకుని టీవీఎస్ స్టార్ సిటీ ద్విచక్ర వాహనంపై తిరిగి శ్రీరంగాపురం బయలుదేరారు.

అభిరామ్ వాహనం నడుపుతుండగా, రామ్‌చరణ్, గోపాల్ వెనుక కూర్చున్నారు. గుండ్లపల్లి క్రాస్ సమీపంలోని హైవేపైకి చేరుకున్న సమయంలో కళ్యాణదుర్గం వైపు నుంచి రాయదుర్గం వైపు వస్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ముగ్గురు విద్యార్థులు రోడ్డుపై పడిపోయారు. ఈ ఘటనలో రామ్‌చరణ్‌కు తలకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామ్‌చరణ్ శనివారం రాత్రి సుమారు 9.05 గంటలకు మృతి చెందినట్లు రాయదుర్గం అర్బన్ సిఐ దేవానంద్ తెలిపారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయదుర్గం సీఐ తెలిపారు.

## వర్షం కోసం మదరసాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పట్టణ సమీపములోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే దారి ప్రక్కన గల మదరసా ప్రార్థన ఆవరణంలో పట్టణంలోని ముస్లిం సోదరులందరూ వర్షం కోసం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ సమస్త జీవరాసులు జీవించాలన్న, మానవుడు మనుగడ చెందాలన్న పాడి పంటలు ప్రధానమైనవని అవి పండాలంటే వరుణ దేవుడు కరుణించాలని వర్షాలు వస్తే సమస్త జీవరాశులకు ఆహారం లభిస్తుందని, జూన్ మాసంలో తనిపొడి వర్షానికి రైతాంగం పంట సాగు చేశారని మూడు మాసాలు గడుస్తున్న వర్షాలు రానందున మొలిచిన మొలకలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళనతో కొట్టుమిట్టలాడుతున్నారని ప్రజల జీవించాలంటే వర్షాలు పడాలి పంటలు పండాలని, వరుణ దేవుని ద్వారా వర్షాలు వచ్చేటట్లు చేయాలని ఆ అల్లా తోడ్పడాలని మనసారా మదరసాలో ప్రార్తనలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

## చైన్ స్నాచింగ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి సీఐ రామారావు ఆదేశాల మేరకు ఎస్సై సురేష్, అమీర్ ఖాన్ ఆధ్వర్యంలో గుత్తి పట్టణంలోని ఎమ్మెస్ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్‌కు చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్ కాని స్టేబుల్ హనుమంతప్ప అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా ప్రయాణించే వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళలు బయటకు వెళ్లే సమయంలో మెడలో ఖరీదైన బంగారు ఆభరణాలను బహిరంగంగా ధరించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ద్విచక్ర వాహనాలపై వెనుక నుంచి వచ్చే వ్యక్తుల పట్ల అప్ర మత్తంగా ఉండాలని తెలిపారు. అ నుమానాస్పద వ్యక్తులు లేదా వాహ నాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచిం చారు. ఏదైనా అనుమానాస్పద ఘ టన చోటుచేసుకున్నా లేదా చైన్ స్నాచింగ్‌కు ప్రయత్నం జరిగినా వెం టనే పోలీసులకు సమాచారం అం దించాలని కోరారు. ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబా టులో ఉంటారని, నేరాల నివారణ లో ప్రజలు కూడా పోలీసులకు సహ కరించాలని పోలీసులు కోరారు.

## డీఎస్సీలో ప్రతిభకు పాతర...?

**- అక్రమాలపై సీబీఐ విచారణకు ఆదేశించాలి: వైసీపీ నేత కె.వి.రమణ**



**అనంతపురం - సూర్య వాస్తవం :** మెగా డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి.రమణ ఆరోపించారు. ప్రతిభావంతులకు అన్యాయం జరిగేలా అనర్హులకు పోస్టులు కట్ట బెట్టారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయుల అర్హతలపై వెలుగులోకి వచ్చిన అంశాలపై ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. స్పోర్ట్స్ కోటాలో నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో డీఎస్సీ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగలేదని అధికారులు ప్రకటించారని, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న ఆరోపణలపై వారు స్పందించాలని రమణ ప్రశ్నించారు. సోషల్ మీడియాలో డీఎస్సీ అక్రమాలపై పోస్టులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ప్రభుత్వం, ప్రస్తుతం వస్తున్న ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని, అవసరమైతే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆయన కోరారు. విద్యాశాఖ మంత్రిని బాధ్యత నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## రాయదుర్గానికి వైసీపీ చేసిన మేలేమిటి ?

- ఎన్నికల సమయంలో వైసీపీ తప్పుడు ప్రచారాలు మానుకోవాలి...
- గత ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు అభివృద్ధిపై లెక్కలు చెప్పాలి...
- అరాచకాలు, పత్రిక ప్రకటనలు తప్ప అభివృద్ధి గత ప్రభుత్వంలో శూన్యం...
- ఎమ్మెల్యే కాలవ ప్రశ్న





**రాయదుర్గం- సూర్య వాస్తవం :** రాయదుర్గం పట్టణాభివృద్ధికి వైసీపీ చేసిన కృషి ఏమిటో చెప్పాలని ఆపార్టీ నాయకు లకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సవాల్ విసిరారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో చేసిన ఒక్క మంచి పనినైనా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాయదుర్గం పట్టణంలోని 24వ వార్డు పరిధిలో ఆదివారం నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టిడిపి శ్రేణులు అనునిత్యం ప్రజలతో కలిసి ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అద్భుతమైన కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 70శాతం ఇళ్లను (60వేల కుటుంబాలు) సందర్శించి ఆయా కుటుంబ సభ్యులతో వ్యక్తిగతంగా సంభాషించడం చాలా ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయదుర్గం పట్టణ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని వైకాపా ఇంచార్జ్ మెట్టు గోవిందరెడ్డి, ఆపార్టీ నాయకులు ప్రకటించడంపై ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ప్రజల కష్టాలు, సమస్యలను పట్టించుకోని వైసీపీ నాయకులు నేడు ప్రజల్లోకి ఏ ముఖం పెట్టుకొని వస్తారని ప్రశ్నించారు. "మీ ఐదేళ్ల పాలనలో రాయ దుర్గానికి చేసిన ఒక్క మంచి పనినైనా చూపించండి. బహిరంగ చర్చకు రండి" అని సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన నయవంచక పార్టీగా వైసీపీ మిగిలిపోయిందని విమర్శించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు, అనుమానాలు సృష్టించేందుకు వారు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా సాగునీటి విషయంలో ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు ఎన్ని రకాలుగా ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గత ఎన్నికల్లోనే ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని, రాబోయే ఎన్నికల్లోనూ అదే విధమైన తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాయదుర్గం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేసిన పనులు, తీసుకొచ్చిన నిధులు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అదే విధంగా వైసీపీ నాయకులు వారి ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిపై ప్రజలకు లెక్కలు చెప్పాలన్నారు. అభివృద్ధి చేయలేని, ప్రజల సమస్యలను పరిష్కరించలేని వారు ఇప్పుడు వైసీపీ ముసుగులో ప్రజల్లోకి వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారాలు, అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, కావలి రవి, బేకరీ తిప్పేస్వమి, సుమలత,టశీకశాల హనుమంతు, పోరాళ్ల పురుషోత్తం, గాజుల వెంకటేశులు,ఆనంద్,సంపత్ కుమారి,బండి భారతి, ప్రశాంతి,పూజరి శివ, వై.వెంకటేశులు,ఎల్లప్ప, జమీల్ ఖాన్,కొండాపురం శ్రీనివాసులు, మల్లి,ఆటో వెంకటేశులు,పైతోట అంజి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సాగిన మస్జిద్ ఏ సఫీ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం...!

- కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, మత పెద్దలు
- వందలాదిగా తరలివచ్చిన ముతవల్లిలు, ఇమాములు, మౌజన్లు
- ఆధ్యాత్మిక సేవలకు ప్రతీకగా నిలవనున్న మస్జిద్ ఏ సఫీ
- షకీల్ సఫీ కుటుంబానికి ప్రముఖుల అభినందనలు





**అనంతపురం టౌన్ -సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న 'మస్జిద్ ఏ సఫీ' నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్హాజ్ కె.యం. షకీల్ సఫీ కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రముఖులు, ముస్లిం మత పెద్దలు, ముతవల్లిలు, ఇమాములు, మౌజన్లు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, మాజీ గ్రంథాలయ చైర్మన్ జె. గౌస్ మొయిద్దీన్, హాస్పిటల్ కమిటీ సభ్యులు గంగారాం, టౌన్ బ్యాంక్ చైర్మన్ జె.ఎల్. మురళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవర్ల మురళి, అనంతపురం టీడీపీ నగర అధ్యక్షులు సుధాకర్ యాదవ్, మార్కెట్ వైస్ చైర్మన్ కె.యం. అర్షద్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు కె.యం. రహమతుల్లా కుమారుడు కె.యం. అరాఫత్, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి, టీడీపీ కార్యాలయ కార్యదర్శి మెహఫిల్ తాజ్ తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మస్జిద్ నిర్మాణం విజయ వంతంగా పూర్తై, భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందించాలని పలువురు ఆకాంక్షించారు. సమాజ శ్రేయస్సు, ఆధ్యాత్మిక అభివృద్ధికి దోహదపడే పవిత్ర నిర్మాణాన్ని చేపడుతున్న కె.యం. షకీల్ సఫీ కుటుంబానికి అల్లాహ్ కృప ఎల్లప్పుడూ ఉండాలని మత పెద్దలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వందలాది మంది ముతవల్లిలు, ఇమాములు, మౌజన్లు, ముస్లిం మత పెద్దలు, శ్రేయోభిలాషులు పాల్గొని శంకుస్థాపన మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## టీడీపీలోకి వైసీపీ 10 కుటుంబాలు

**- పసుపు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్**



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం వన్నెదొడ్డి గ్రామంలో గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి, పామిడి మండలాల ఇన్‌ఛార్జి యువనేత గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో గుత్తి మండలం వన్నెదొడ్డి గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు 10 కుటుంబాలు తెలుగు దేశం పార్టీ తీర్థం పుచ్చుకోవడం జరిగింది. పార్టీలో చేరిన వారిని పసుపు కండువా కప్పి సాధారణంగా ఆహ్వానిం చడం జరిగినది. పార్టీలు చేరిన వారిని ఉద్దేశించి మా ట్లాడుతూ కూటమి ప్రభు త్వం చేస్తున్న అభివృద్ధిని చెల్లించి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోవడం జరిగిం దని తెలిపారు అలాగే తెలు గుదేశం పార్టీ తీర్థం తీసుకు న్నవారు మాట్లాడుతూ కూ టమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చలించి తెలుగుదేశం పార్టీలోకి చేరడం జరిగిందని తెలిపారు.

జరగబో యే స్థానిక ఎన్నికల్లో గెలిపిం చుకుని తీరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొ ల్లె ఎర్రిస్వామి, కొల్లే ధనలక్ష్మి, కొల్లే దేవేంద్ర,కొల్లే చంద్రకళ, కొల్లే రామాంజనేయులు(తా త),కొల్లే మల్లమ్మ, కొల్లేఉమా మహేశ్,కొల్లే పరమేష్,కొల్లే మంజునాథ్,కొల్లే గురుస్వా మి,కొల్లే మల్లీశ్వరి,కొల్లే నారాయణస్వామి, కొల్లే కుమారి, కొల్ల తరుణ్, కొల్లే ప్రవీణ్, కొల్లే వంశీ,కొల్లే వేణు,కొల్లే శ్రీ నివాసులు,కొల్లే జయమ్మ, కొల్లే మల్లికార్జున,ఆరేటి ర మణ(గొర్ల పెద్ద) గుత్తి పట్ట ణం మరియు మండల కు టుంబ నాయకులు కార్యక ర్తలు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగింది.

# నింగి నుంచి నిఘా...!

**- శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం.. ఎస్పీ పి జగదీష్**
**- అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి**
**- సమస్యాత్మక ప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో ముమ్మరంగా గస్తీ**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలా పాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా డ్రోన్లతో గస్తీ నిర్వహించారు.సమస్యాత్మక ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, అనుమానాస్పద స్థావరాలపై ఆధునిక డ్రోన్ కెమెరాల ద్వారా పోలీసులు నిశితంగా పరిశీలించారు. సాధారణంగా చేరుకోవడానికి కష్టతరమైన ప్రాంతాలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేస్తూ అనుమానాస్పద కదలికలపై ప్రత్యక్ష ఫుటేజీ ద్వారా నిఘా కొనసాగించారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే ఈ ప్రత్యేక డ్రోన్ గస్తీ చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని పేర్కొన్నారు.చట్టాన్ని ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, అనుమానాస్పద కదలికలు గుర్తించినా వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రామ్‌నగర్‌లో నూతన మసీదు నిర్మాణానికి శంకుస్థాపన...!

**- మత పెద్దలు, ముస్లిం సోదరులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ**
**- మత సామరస్యం, సోదరభావాన్ని బలోపేతం చేయాలి: ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలోని రామ్నగర్ 80 ఫీట్ రోడ్డులో నూతన మసీదు నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ముస్లిం సోదరులతో కలిసి మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.మసీదు నిర్మాణ పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తికావాలని ఎంపీ ఆకాంక్షించారు. అనంతపురం అభివృద్ధితో పాటు మత సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రజలంతా కలిసి ముందుకు సాగాలని కోరారు.అనంతపురం ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఐకమత్యంతో జీవించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముతవల్లి రాష్ట్ర సంఘం అధ్యక్షుడు షకీల్ సఫీ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ శాసనసభ్యుడు వైకుంఠ ప్రభాకర్ చౌదరి, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ మురళి, సీపీఐ నాయకుడు జాఫర్, నౌషాద్, నరసింహులు, వెంకటేశ్వర్ రెడ్డి, మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సికాయికుంటపల్లిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు...!

**- భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్**



**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా బుక్కపట్నం మండలం సికాయికుంటపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడు కలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీకృష్ణ పరమాత్మ పల్లకి సేవలో గ్రామస్తులతో కలిసి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.శ్రీకృష్ణుడి బోధనలు ధర్మాన్ని కాపాడుతూ సత్యం, న్యాయం, ఐక్యతతో ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని ఆదినారాయణ యాదవ్ పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించిన నిర్వాహకులు, గ్రామస్తులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# బాబోయి దోమలు....!

- దోమల బెడదతో గోవిందవాడ గ్రామస్తుల అవస్థలు ..
- జ్వరంతో 5వ తరగతి విద్యార్థి మృతి, అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం
- నిద్రమత్తులో అధికారులు
- కలెక్టర్ సారు.... మీరైనా ఇటు చూడండి...!



**బొమ్మనహాళ్ - సూర్య వాస్తవం :** బొమ్మనహాళ్ మండల పరిధిలోని గోవిందవాడ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. పలుచోట్ల ఇళ్ల ముందు మురుగునీరు నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం వేళల్లో దోమల బెడద మరింత పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలోని పలు ప్రాంతాల్లో కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్ల పక్కన, ఇళ్ల ముందు నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. చిన్నారులు, వృద్ధులు సహా గ్రామస్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఇదిలా ఉండగా, ఆగస్టు 31న గోవిందవాడలోని ఎం.పి.పి. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న తిప్పేశ్ జి. అనే విద్యార్థి జ్వరంతో మృతి చెందాడు. అయితే విద్యార్థి మృతికి ఖచ్చితమైన వైద్య కారణం నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గ్రామంలోని అపరిశుభ్ర వాతావరణం, నిలిచిపోయిన మురుగునీరు, దోమల బెడదపై గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు."గ్రామంలో చాలా కాలంగా డ్రైనేజీ సమస్య ఉంది. ఇళ్ల ముందు మురుగునీరు నిలిచిపోతోంది. దోమల బెడద తీవ్రంగా ఉంది. చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ఆందోళన కలుగుతోంది. విద్యార్థి జ్వరంతో మృతి చెందిన ఘటన జరిగినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరం" అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

**తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్..**

గ్రామంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించాలని వారు కోరుతున్నారు. రోడ్లపై, ఇళ్ల ముందు నిలిచిన మురుగునీటిని తొలగించడం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, అవసరమైతే వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి గోవిందవాడలోని పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# పౌష్టికాహారం అందకపోతే... వాట్సాప్‌లో ఫిర్యాదు...!

**- అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం ఆహారం అందకపోయినా ఫిర్యాదు చేయొచ్చు - కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్: 94417 82200 - ఐసీడీఎస్ పీడీ కటారి ప్రమీల**



**పుట్టపర్తి - సూర్య వాస్తవం :** అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందకపోతే జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 94417 82200కు ఫిర్యాదు చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ కటారి ప్రమీల తెలిపారు.కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఫిర్యాదుల పరిష్కారానికి వాట్సాప్ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ అంగన్‌వాడీ కేంద్రంలోనైనా పౌష్టికాహారం పంపిణీ చేయకపోయినా, మెనూ ప్రకారం భోజనం అందించకపోయినా వెంటనే వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.పిర్యాదుతో పాటు లబ్ధిదారు పేరు, మొబైల్ నంబర్, అంగన్‌వాడీ రిజిస్ట్రేషన్ నంబర్, కేంద్రం పేరు, గ్రామం/వార్డు, మండలం వివరాలు పంపాలని సూచించారు. అవసరమైతే ఫొటోలు, ఇతర ఆధారాలను కూడా జత చేయవచ్చన్నారు.అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారని, అర్హులైన లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు చేపడతామని పీడీ ప్రమీల స్పష్టం చేశారు. గమనిక: ఫిర్యాదులు వాట్సాప్ ద్వారా మాత్రమే స్వీకరిస్తామని, ఫోన్ కాల్స్ స్వీకరించబోమని అధికారులు తెలిపారు.

# ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**- హాజరైన వైసీపీ అనంతపురం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధ యాదవ్**



గుత్తి - సూర్య వాస్తవం : గుత్తి మండలం కె.ఉబిచేర్ల గ్రామంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన వైసీపీ అనంతపురం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధ యాదవ్ 6-9-2026 చివరి రోజు(ప్రజాద సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం ద్వారా పిల్లలు పెద్దలు గ్రామా ప్రజలు భో జనాలు చేసి శ్రీ కృష్ణాష్టమీ సందర్భంగా పల్లికి ఊరేగింపు కార్యక్రమంలో మై కులు ద్వారా భక్తి పాటలు, భగవద్గీ త శ్లోకాలు చిన్న పిల్లల నృత్యాలు ద్వారా గ్రామా వీదుల నుండి శ్రీకృష్ణ పిల్లకి ఉత్సవ ఊరేగింపు ప్రజల మధ్యభారీఎత్తున జరిగింది.ఈ కార్య క్రమంనకు ప్రభోద సేవా సమితి,కె ఉ బిచర్ల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొంటారు.

# నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న జిల్లా వైసీపీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ చెన్నకేశవరెడ్డి



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలో వైఎస్ఆర్సిపి మైనార్టీ నాయకుడు కొట్టం నూర్ భాష కూతురి నిశ్చితార్థం వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన అనంతపురం జిల్లా వైఎస్ఆర్సిపి ఆర్గనైజేషన్ సెక్రెటరీ పామిడి చెన్నకేశవరెడ్డి కార్యక్రమంలో, పామిడి టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి వైఎస్ఆర్సిపి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సూరి వాల్మీకి,టౌన్ ఉపాధ్యక్షులు తుల్లా భాయ్,జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మీసాలు రామచంద్ర వాల్మీకి, మాజీ టౌన్ కన్వీనర్ జోజోడు కుమార్ మైనార్టీ నాయకుడు ఫిర్యాదుఖాన్, మాజీ ఎంపీపీ డాక్టర్ మస్తానయ్య, జనార్దన్ రెడ్డి, నీలకంఠ రెడ్డి సురేష్, టౌన్ ప్రధాన కార్యదర్శి విభూది ఖాసిం టౌన్ ఉపాధ్యక్షులు సల్లుద్దీన్ నాగేష్ యాదవ్, ఉదయ్, వెంకటేష్, కొండాపురం దేవరాజు గ్యాస్ షేక్షావలి వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్లూరులో వివాహ వేడుకలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి నాయకులు



**గార్లదిన్నె- సూర్య వాస్తవం:** కల్లూరు గ్రామంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో వైసిపి గ్రామ నాయకులు చీమలకొండ యాదవ్ కుమార్తె వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈశుభ వివాహానికి ముఖ్య అతిథులుగా వై.నారాయణరెడ్డి జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు, పైలా నరసింహయాదవ్, చీమల శ్రీనివాసులు, జమ్మలది న్నెసుధాకర్ రెడ్డి, బచ్చలన్న, అట్టే శ్రీనివాసులు, అగ్రహారం ప్రసాద్‌లు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వుండాలని కోలారు.అలాగే కల్లూరు పంచాయతీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వధూవరుల కొత్త జీవితానికి మన అందరి ఆశీస్సులే తొలి అడుగులు. వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు వారి దాంపత్య జీవితం నూరేళ్లు సుఖసంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

# తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రకాష్‌రెడ్డి



**అనంతపురం - సూర్య వాస్తవం :** రాప్తాడు నియోజకవర్గంలో ఆదివారం పలు వివాహ కార్యక్రమాలు, గృహ ప్రవేశాలకు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.అనంతరం రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామానికి చెందిన వడ్డే రమణ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వ్యాపారం విజయవంతంగా కొనసాగాలి

**- శ్రీ సాయి ఎగ్ హౌస్ ప్రారంభోత్సవంలో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి..**
**- నిర్వాహకుడు మంజును అభినందించిన మాజీ ఎమ్మెల్యే**

**అనంతపురం - సూర్య వాస్తవం :** పావగడ తాలూకా నాగలమడక మండలం బుగడూరు గ్రామంలో రామగిరి మండలం కానుగులకుంట గ్రామానికి చెందిన మంజు ఏర్పాటు చేసిన "శ్రీసాయి ఎగ్ హౌస్" ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరై శ్రీసాయిఎగ్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు మంజును అభినందించి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో స్థానికులు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.



# అధైర్య పడొద్దు...నేనున్నాను నీకు...

**- మునిపటిలాగే రాజకీయాల్లో యాక్టివ్ అవ్వాలి...- డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యంకు భరోసా కల్పించిన నారా లోకేష్...**

**- విమానాశ్రయంలో నారా లోకేష్‌కు స్వాగతం పలికిన కోడూరు బాలసుబ్రమణ్యం...**

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** తిరుపతి:- తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులు,క్రమశిక్షణ గల నేత డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం కు అధైర్య పడొద్దు....నేనున్నాను నీకు అంటూ చేతిలో చేయి వేసి మంత్రి నారా లోకేష్ భరోసా కల్పించిన సంఘటన ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో చోటు చేసుకుంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, విద్యాశాఖ,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చిత్తూరు పాకాల లలో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకు ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు.ఆ సమయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం నారా లోకేష్ ను ఘన స్వాగతం కలిసిన సమయంలో ఈ దృశ్యం చోటు చేసుకుంది.డా.కోడూరు బాలసుబ్రమణ్యం తో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడుతూ ముమ్మందు పార్టీ కార్యక్రమాలలో యాక్టివ్‌గా పాల్గొనాలని,పార్టీ



బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గంలో మరింత చురుకుగా పనిచేసి ప్రజాక్షేత్రంలో విరివిగా పాల్గొనాలని నారా లోకేష్ సూచించారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.మంత్రి నారా లోకేష్ అందించిన ఈ భరోసా,ఆత్మస్థైర్యం తనకు మరింత బాధ్యతను, ఉత్సాహాన్ని ఇచ్చిందని డా.కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు.లోకేష్ మాటలు నాకు మరింత శక్తిని ఇచ్చాయి. ఆయన సూచనల మేరకు మరింత యాక్టివ్‌గా ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తాను"అని పేర్కొన్నారు.

పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో,మంత్రి నారా లోకేష్ మార్గదర్శ కత్వంలో ప్రజా సమస్యలపై మరింత బలంగా పనిచేస్తూ, పార్టీకి, ప్రజలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటానని డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు. డా.కోడూరు బాల సుబ్రమణ్యంకి మంత్రి నారా లోకేష్ ఇచ్చిన స్పష్టమైన భరోసాపై పార్టీ నాయకులు, సీనియర్ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# వినాయక ఉత్సవాలకు పోలీస్ ముందస్తు దిశానిర్దేశం

**-నాయుడుపేటలో గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీస్ సమన్వయ సమావేశం**

**-అనుమతులు, భద్రతా నిబంధనలు తప్పనిసరి "డీఎస్పీ చెంచు బాబు"**

**-శాంతిభద్రతలే ధ్యేయం వినాయక ఉత్సవాలపై సిఐ వెంకటేశ్వరరావు సూచనలు**

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** రాబోయే వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వహించు కోవాలని నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు పట్టణ సీఐ వెంకటేశ్వరరావు లు గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. ఆదివారం నాయుడుపేట పట్టణంలోని వినాయక మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ పండుగ ప్రారంభం నుంచి విగ్రహ ప్రతిష్ఠ,ఊరేగింపు,నిమజ్జనం వరకు ప్రతి దశలోనూ నిర్వాహకులు చట్టబద్ధమైన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. సంబంధిత పోలీస్, విద్యుత్, రెవెన్యూ, పురపాలక శాఖల అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని సూచించారు.మండపాల వద్ద అగ్నిప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు జరగకుండా నాణ్యమైన వైరింగ్ వాడాలని,భద్రతా చర్యలు కచ్చితంగా తీసుకోవాలని అధికారులు తెలిపారు.ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, అనుమానాస్పద కదలిక లపై అప్రమత్తంగా ఉండడం అవసరమని పేర్కొన్నారు.అలాగే మైక్ సెట్లు,డీజే శబ్దాలపై విధించిన పరిమితులను ఖచ్చితంగా పాటించాలని,అనుమతి లేని శబ్ద యంత్రాలు వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.నిమజ్జన ఊరేగింపుల





సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా,భక్తులకు ఇబ్బంది లేకుండా నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,క్రమశిక్షణతో, అందరి భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్వహించుకోవాలని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సొంత గూటికి సూళ్లూరుపేట జనసేన

# మాజీ మండల అధ్యక్షులు ఆవుల రమణ

**- ఆయన ఆధ్వర్యంలో పార్టీలో చేరిన పలు వృత్తులు, వర్గాల ప్రతినిధులు**

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గం జనసేనపార్టీ కార్యాలయంలో, పవన్ కళ్యాణ్‌పై ఉన్న విపరీతమైన అభిమానంతో జనసేన పార్టీలోకి తిరిగి ఆదివారం చేరిన సూళ్లూరుపేట మండల మాజీ అధ్యక్షులు ఆవుల రమణ.ఈ సందర్భంగా ఆవుల రమణ మాట్లాడుతూ పార్టీ కోసం 2007లో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ గా మొదలై,2014లో జనసేన ఆవిర్భావం నుండి సూళ్లూరుపేట (రూరల్,టౌన్)లో పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేశానని, 2021 మున్సిపల్ ఎన్నికల్లో తనతో పాటు భార్య, మరో ఇద్దరు కార్యకర్తలతో నామినేషన్లు వేయించారు.అధికార పార్టీ బెదిరింపులకు భయపడకపోవడంతో రాత్రికి రాత్రే పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి గంజాయి,అక్రమ మద్యం లాంటి తప్పుడు కేసులు బనాయించినా పార్టీ కోసమే నిలబడ్డారు అని,ఇటీవల పార్టీలో గుర్తింపు,పదవుల విషయంలో జరిగిన కొన్ని పరిణామాల వల్ల తీవ్ర మనస్తాపానికి గురై 10 రోజుల క్రితం జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరారు.కానీ





మెగా కుటుంబంపై ఉన్న అభిమానంతో ఉయ్యాల ప్రవీణ్ సమక్షంలో తిరిగి జనసేనలో చేరాను అని తెలియజేసారు. ఇకపై తనకు ఎలాంటి పదవుల పట్ల ఆశ లేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ గుర్తింపు ఇచ్చి పదవి ఇచ్చినా, ఇవ్వకపోయినా ప్రాణం ఉన్నంత వరకు పవన్ కళ్యాణ్ కోసం, జనసేన పార్టీ కోసమే ఒక సైనికుడిగా పనిచేస్తానని ప్రమాణం చేశారు.అనంతరం ఉయ్యాల ప్రవీణ్, అట్ల కృష్ణా రావు గారి సమక్షంలో, మన్నెం వెంకట్ - సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ లీడర్,సిరివేటి బద్రి, నాగరాణి - శ్రీసిటీ సెజ్ (శ్రీ సిటీ సెజ్) సూపర్వైజర్,మణికం -అపెక్స్ (అపెక్స్) కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ పలు వృత్తులు, వర్గాల ప్రతినిధులు జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో బూదూరు నాగరాజు, నెల్లూరు చిన్న, గొర్రెపాటి చెంగయ్య,మిజూరు లత,మనోజ్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గణనాథుడి మండప ప్రాంగణంలో నెలవల రాజేష్ జన్మదిన వేడుకలు

**-పెద్ద దర్గా వీధి గణపతి మండపంలో ఉత్సవ కమిటీ ఆత్మీయ సత్కారం**

**-రజతోత్సవ గణపతి మండప సందర్శనలో నెలవల రాజేష్‌కు ఘన స్వాగతం**

**-గణపతి మండప పనులు పరిశీలించిన నెలవల రాజేష్‌కు కేక్ కట్‌తో శుభాకాంక్షలు**



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణంలోని శ్రీ పెద్ద దర్గా వీధి సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న గణపతి మండప ప్రాంగణం ఆదివారం ఉత్సవ వాతావరణంతో కళకళలాడింది.పాతికేళ్ల రజతోత్సవాల సందర్భంగా అత్యంత వైభవంగా రూపొందిస్తున్న ఈ మండప పనులను సందర్శించేందుకు వచ్చిన టీడీపీ నాయకులు నెలవల రాజేష్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.అదే వేదికపై ఆయన జన్మదిన వేడుకలు కూడా ఆత్మీయంగా నిర్వహించారు.శ్రీ పెద్ద దర్గా వీధి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్ కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న భారీ సినిమా సెట్టింగ్ మండప నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.భాగ్యనగరం నుంచి తరలిస్తున్న విశాలమైన గణనాథుడి విగ్రహం,పూజా కార్యక్రమాలు,రజతోత్సవ ఉత్సవాల ఏర్పాట్ల గురించి కమిటీ ప్రధాన నిర్వాహకులు ఎస్.జె. రాజేష్ నెలవల రాజేష్‌కు వివరించారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు నెలవల రాజేష్‌ను శాలువా తో సత్కరించారు.అనంతరం మండప ప్రాంగణంలోనే కేక్ కట్ చేయించి ఆయన జన్మదినాన్ని జరుపుకున్నారు.శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమాన్ని ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు సుధాకర్,రమేష్, రామారావు,హరి,స్టాలిన్,చిన్నయ్య,జయరామ్, నజీర్,రమేష్ ఎస్,శివ,సుల్తాన్,పవన్,జస్వంత్, భారత్ ఆటో సాయి కిషోర్,గోనుపల్లి గురుమూర్తి, బల్లి కుమార్,ఆవుల సుధాకర్,బయ్యా రామారావు, బయ్యా రమేష్,దేవతా గోపి,శంకర్ లాల్,సొంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మస్తాన్ జన్మదిన వేడుకలు



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** యంగ్ అండ్ డైనమిక్ లీడర్ మస్తాన్ పుట్టినరోజు పుట్టినరోజు సందర్భంగా మస్తాన్‌అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించి శాలువాలతో ఘనంగా సన్మానం, మరికొందరు శ్రేయోభిలాషులు పుష్ప గుచ్ఛాలు అందజేశారు. యూనిచాం.!ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణకు మారుపేరు.సహాయ గుణంలో ముందుండే నాయకుడు మస్తాన్ అని తెలియజేశారు. అభిమానులు,సహచర ఉద్యోగుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఆయన పుట్టినరోజు సందర్భంగా ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ.మస్తాన్ అంటే కేవలం షిఫ్ట్ లీడర్ మాత్రమే కాదని,తోటి ఉద్యోగులకు అండగా నిలిచే ఆత్మీయుడని,సమస్య వచ్చినప్పుడు ముందుండి పరిష్కరించే సహాయకుడని కొనియాడారు. విధి నిర్వహణలో క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ, బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ సహ చరులను సైతం ముందుకు నడిపించే సత్తా ఆయన సొంతమన్నారు. ధైర్యం,దమ్ము,క్రమశిక్షణ,సహాయ గుణం కలగలిపిన వ్యక్తిత్వం మస్తాన్‌అని పేర్కొన్నారు. పని ప్రదేశంలో ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగడం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. సహచర ఉద్యోగుల సమస్యలను తన సమస్యగా భావించి ఎల్లవేళలా అండగా నిలవడం వల్లే మస్తాన్‌కు ఇంతటి అభిమానగణం ఏర్పడిందన్నారు. పుట్టినరోజు సందర్భంగా మస్తాన్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి మరింత మందికి ఆదర్శంగా నిలవాలని అభిమానులు ఆకాంక్షించారు

# ధర్మవరంలో మెగా జాబ్ మేళా

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** మన ధర్మవరం నియోజకవర్గ నిరుద్యోగ యువతకు శుభవార్త! రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవతో సెప్టెంబర్ 8న ధర్మవరం లోని సీఎన్‌బీ (సీ బి న్) కళ్యాణ మండపంలో మెగా జాబ్ మేళా జరుగనుంది.సంస్కృతి సేవా సమితి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాలో 100కు పైగా కంపెనీలు పాల్గొననుండగా,నెలకు రూ.15,000 నుంచి రూ.50,000 వేతనంతో ఉద్యోగాలు కల్పిస్తారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన 18-35 ఏళ్ల యువతీ యువకులు విద్యార్హతల సర్టిఫికెట్లు,ఆధార్ కార్డు,రెండు ఫోటోలతో హాజరుకావాలి.



# బిగ్ బాస్ 10: హౌస్ లోకి వెళ్లిన కంటెస్టెంట్లు వీళ్లే..

# గ్రాండ్ గా తొలి ఎపిసోడ్




తెలుగు టెలివిజన్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రియాలిటీ షో 'బిగ్ బాస్ తెలుగు' పదో సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. కింగ్ నాగార్జున మరోసారి హోస్ట్‌గా తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించారు. ఈ సీజన్‌లో సినీ, టీవీ ప్రముఖులతో పాటు, 'అగ్నిపరీక్ష' అనే ప్రత్యేక ప్రక్రియ ద్వారా ఎంపికైన సామాన్యులకు కూడా అవకాశం కల్పించారు. గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్‌లో మొత్తం 16 మంది కంటెస్టెంట్లు బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టారు. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన ఈ కంటెస్టెంట్ల పూర్తి వివరాలు కింద ఉన్నాయి.

**బిగ్ బాస్ 10 కంటెస్టెంట్లు:**

1. దేబ్జానీ మోదక్: 'ఎన్నెన్నో జన్మల బంధం' సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈమె, 'గిరగిరా గింగిరాని వే' పాటకు డ్యాన్స్ చేస్తూ హౌస్‌లోకి మొదటి కంటెస్టెంట్‌గా ప్రవేశించారు.
2. త్రిగుణ్: గతంలో అదిత్ అరుణ్ పేరుతో సినిమాలు చేసిన ఈయన, తన పేరును త్రిగుణ్‌గా మార్చుకున్నారు. బిగ్ బాస్ ద్వారా ఫ్యామిలీ ఆడియన్స్‌కు మరింత దగ్గరవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.
3. ఝూన్సీ: సింగర్‌గా గుర్తింపు పొందిన ఈమె, గోల్డెన్ టికెట్ విజేతగా హౌస్‌లోకి అడుగుపెట్టారు. 'రైతు బిడ్డ' పాటను భావోద్వేగంగా పాడి అందరినీ ఆకట్టుకున్నారు.
4. సుధీర్ రెడ్డి (సుధీర్ టాక్స్): ప్రముఖ పాడ్‌కాస్టర్‌గా సోషల్ మీడియాలో గుర్తింపు పొందిన సుధీర్, తన జీవితంలోని కష్టాలను నాగార్జునతో పంచుకున్నారు.
5. అమన్: 'అగ్నిపరీక్ష'లో అత్యధిక ఓట్లు సాధించి ఎంపికైన కంటెస్టెంట్. తాను గేమ్‌లో ఎట్టిపరిస్థితుల్లోనూ ఫ్లిప్ అవ్వనని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.
6. చైత్ర రాయ్: 'అష్టాచమ్మా' సీరియల్‌తో 'స్వప్న'గా పేరుగాంచిన ఈమె, పెళ్లి తర్వాత బరువు పెరగడంపై వచ్చిన ట్రోలింగ్‌ను సవాలుగా తీసుకుని 20 కిలోలు తగ్గినట్లు తెలిపారు.
7. ఆటో రామ్ ప్రసాద్: జబర్దస్త్ కమెడియన్‌గా సుపరిచితుడైన రామ్ ప్రసాద్, తనదైన కామెడీ పంచ్‌లతో హౌస్‌లోకి ఎనర్జిటిక్‌గా ఎంట్రీ ఇచ్చారు.
8. షాలిని: జ్యూరీ సభ్యుడు నవీన్ చేత ఎంపికైన సామాన్యురాలు. తాను చాలా ఎక్కువగా మాట్లాడతానని, నాగార్జునను ప్రశంసలతో ముంచెత్తారు.
9. టెంపర్ వంశీ: 'టెంపర్', 'నేనింతే' వంటి చిత్రాల్లో ప్రతినాయక పాత్రలతో గుర్తింపు పొందిన వంశీ, తనలోని ఎమోషనల్, ఫ్యామిలీ మ్యాన్ కోణాన్ని ప్రేక్షకులకు చూపించాలని వచ్చానని చెప్పారు.
10. సృష్టి వ్యాకరణం: జ్యూరీ సభ్యురాలు, మాజీ కంటెస్టెంట్ శ్రీముఖి చేత ఎంపికయ్యారు. తన సంకల్పమే తన బలమని, ఇతరులను సులభంగా నమ్మడం బలహీనత అని తెలిపారు.
11. నరేశ్ (పొట్టి నరేశ్): జబర్దస్త్ ఫేమ్ నరేశ్, గూగుల్‌లో తన పేరు వెతికితే 'బిగ్ బాస్ 10 నరేశ్' అని రావాలనే లక్ష్యంతో షోలోకి వచ్చినట్లు చెప్పారు.
12. ఆర్జే చరణ్: ఆడియన్స్ ఓటింగ్ ద్వారా ఎంపికైన చరణ్, తన చుట్టూ ఉన్నవారిని నవ్వించడమే తన బలమని, తాను చిరంజీవికి, నాగార్జునకు పెద్ద అభిమానినని పేర్కొన్నారు.
13. కృష్ణుడు: 'హ్యాపీ డేస్', 'వినాయకుడు' వంటి చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న కృష్ణుడు, తన బరువు వెనుక ఉన్న కథను పంచుకున్నారు. తాను అమాయకుడిని కాదని, తనలోని మరో కోణాన్ని చూపిస్తానని అన్నారు.
14. వర్షిణి సౌందరరాజన్: యాంకర్, నటిగా గుర్తింపు పొందిన వర్షిణి, మొదట బిగ్ బాస్ ఆలోచన లేకపోయినా, కాలక్రమేణా ఆసక్తి పెరిగిందని తెలిపారు.
15. రోహిత్: జ్యూరీ సభ్యురాలు బిందు మాధవి ఎంపిక చేసిన సామాన్య యువకుడు. హౌస్‌లోని ఒకరిపై నీళ్లు చల్లాలనే టాస్క్‌ను సున్నితంగా తిరస్కరించి తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు.
16. ముఖేశ్ గౌడ: 'గుప్పెడంత మనసు' సీరియల్‌తో 'రిషి'గా తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ముఖేశ్, 16వ కంటెస్టెంట్‌గా అడుగుపెట్టారు. తన మాతృభాష కన్నడ అయినా, తెలుగు తన గుండెల్లో ఉందని, తన తెలుగులో తప్పులుంటే క్షమించాలని కోరారు.

ఇలా విభిన్న రంగాలకు, నేపథ్యాలకు చెందిన 16 మందితో బిగ్ బాస్ హౌస్ కళకళలాడుతోంది. వంద రోజుల పాటు సాగే ఈ ప్రయాణంలో ఎవరు ప్రేక్షకులను మెప్పించి టైటిల్ విజేతగా నిలుస్తారో వేచి చూడాలి.



## తన విషయంలో దర్శకుడు ఎంత ముఖ్యమో చెప్పిన టబు

దశాబ్దాలుగా తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తున్న సీనియర్ నటి టబు, ఒక నటిగా తన విజయంలో దర్శకుడి పాత్ర ఎంత కీలకమో వివరించారు. తాను పూర్తిగా 'డైరెక్టర్స్ యాక్టర్' అని, తన నటన దర్శకుడి ప్రతిభపైనే ఆధారపడి ఉంటుందని ఓ పాత మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఒక సినిమా బాగుండాలన్నా, బాగోలేకపోయినా దానికి ప్రధాన కారణం దర్శకుడేనని టబు బలంగా నమ్ముతారు. "నా నటన, అంతకంటే ముఖ్యంగా సినిమా ఫలితం దర్శకుడిపై ఆధారపడి ఉంటుంది. అందుకే నాకు మంచి దర్శకుడితో పనిచేయడం చాలా ముఖ్యం" అని ఆమె పేర్కొన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత మంచి సినిమానే అని, ఆ తర్వాతే తన పాత్ర గురించి ఆలోచిస్తానని స్పష్టం చేశారు. "నాకు మంచి పాత్ర లభించినా, దాని నుంచి అత్యుత్తమ నటనను రాబట్టుకోవాల్సింది దర్శకుడే. ఈ విషయంలో నేను పూర్తిగా దర్శకుడిపైనే ఆధారపడతాను" అని టబు వివరించారు. 1985లో దేవ్ ఆనంద్ 'హమ్ నౌజవాన్' చిత్రంతో టీనేజ్‌లోనే వెండితెరపై కనిపించిన టబు, 1991లో వెంకటేష్ హీరోగా వచ్చిన తెలుగు చిత్రం 'కూలీ నెం. 1'తో కథానాయికగా అరంగేట్రం చేశారు. ఆ తర్వాత 1994లో విడుదలైన బాలీవుడ్ చిత్రం 'విజయ్‌పథ్'తో ఆమె మొదటిసారిగా భారీ విజయాన్ని అందుకున్నారు. ఇక ప్రస్తుతం, టబు 'దృశ్యం 3: ది కన్‌క్లూజన్' చిత్రంలో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో ఆమె మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మీరా దేశ్‌ముఖ్ పాత్రను మరోసారి పోషించబోతున్నారు. అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్, జైదీప్ అహ్లావత్, ఇషితా దత్, శ్రియా శరణ్, రజత్ కపూర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహిస్తున్న ఈ పనోరమా స్టూడియోస్ ప్రొడక్షన్, 2026 అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.



# వైభవ్ సూర్యవంశీపై తిలక్ వర్మ స్లెడ్జింగ్..

## అర్ధశతకం చేజార్చుకున్న యువ సంచలనం.. ఫ్యాన్స్ ఫైర్!



నేడు సౌత్ జోన్‌తో ప్రారంభమైన ఫైనల్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 44 పరుగులు చేసి అర్ధశతకానికి చేరువలో ఔటయ్యాడు. అయితే, అతను ఔటవడానికి ముందు సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మతో జరిగిన ఓ చిన్న సంఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తిలక్ వర్మ, వైభవ్‌ను ఉద్దేశించి స్లెడ్జింగ్ చేయగా, ఆ తర్వాత కొద్దిసేపటికే వైభవ్ తన వికెట్ కోల్పోయాడు.మ్యాచ్ సమయంలో తిలక్ వర్మ.. "ఏంటి యార్ ఈ వైస్ కెప్టెన్" అంటూ వైభవ్‌ను రెచ్చగొట్టేలా మాట్లాడటం వినిపించింది. అయితే, ఈ సంఘటన తర్వాత ఇద్దరు ఆటగాళ్లు నవ్వుతూ కనిపించడంతో దీన్ని సీరియస్‌గా తీసుకోనట్లు అనిపించింది. కానీ, సోషల్ మీడియాలో మాత్రం అభిమానులు తిలక్ తీరును తప్పుబడుతున్నారు. 15 ఏళ్ల కుర్రాడిపై స్లెడ్జింగ్ వ్యూహం అవలంబించడం సరికాదని పలువురు విమర్శలు గుప్పించారు. ఈ స్లెడ్జింగ్ తర్వాత చామ మిలింద్ బౌలింగ్‌లో వైభవ్ ఔటయ్యాడు. అంతకు ముందు వైభవ్ తన ఇన్నింగ్స్‌ను ఎంతో దూకుడుగా ప్రారంభించాడు. భారత సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లోనూ అద్భుతమైన షాట్లు ఆడాడు. మొత్తం మీద 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 44 పరుగులు సాధించాడు. వైభవ్ దూకుడైన ఆటతీరు మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్‌పైనా ప్రభావం చూపినట్లు కనిపించింది. ఈశ్వరన్ కూడా దూకుడుగా ఆడి 86 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 72 పరుగులు చేసి రనౌట్‌గా వెనుదిరిగాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో శుభారంభం చేసింది.

## భారత్ చేతిలో ఘోర ఓటమి..

# అయినా మేమే బెస్ట్: పాక్ కోచ్ వహాబ్ రియాజ్



మహిళల ఆసియా కప్ 2026లో భాగంగా నిన్న భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. అయితే, ఈ ఓటమి తర్వాత పాక్ మహిళల జట్టు కోచ్ వహాబ్ రియాజ్ చేసిన వ్యాఖ్యలు క్రీడా వర్గాలను విస్తుపోయేలా చేశాయి. టీమిండియా చేతిలో చిత్తుగా ఓడినప్పటికీ, ఈ టోర్నీలో తమ జట్టే అత్యుత్తమమైనదని ధీమా వ్యక్తం చేశాడు.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్, భారత బౌలర్ల ధాటికి కేవలం 18.1 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు మునీబా అలీ, షావల్ జుల్ఫికర్ మినహా మరే బ్యాటర్ కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. భారత బౌలర్లలో శ్రీ చరణి 3, దీప్తి శర్మ 2, ప్రేమ రావత్ 2 వికెట్లతో పాక్ పతనాన్ని శాసించారు. అనంతరం 56 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని టీమిండియా కేవలం 8.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది.మ్యాచ్ అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడిన వహాబ్ రియాజ్.. "మా జట్టులోని క్రీడాకారిణులంతా ఎంతో నైపుణ్యం ఉన్నవారు. వారు తమను తాము నమ్మాలి. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో చేసిన తప్పులపై చర్చిస్తాం. వాటిని పునరావృతం చేయకుండా చూసుకుంటాం. ఈ ఆసియా కప్‌లో ట్రోఫీ గెలవడానికి పాకిస్థానే అత్యుత్తమ జట్టు అని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను. ఎందుకంటే ఇక్కడి పరిస్థితులు మాకు బాగా అనుకూలిస్తాయి" అని వ్యాఖ్యానించాడు.



## సాత్విక్-చిరాగ్ సంచలనం..

## చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం

భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు.గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు.నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

# ముఖ్యమంత్రి చంద్రబాబు, జెఏసి చైర్మన్ విద్యాసాగర్‌లకు కృతజ్ఞతలు

**- జేఏసీ తాలుకా అధ్యక్షుడు రామసుబ్బయ్య యాదవ్**



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** ఏపీ ఎన్జిజివో'స్ అసోసియేషన్, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు, జెఏసి చైర్మన్ జె.రామ సుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరపడం, ఆ చర్చలలో ఏపీ యన్ జి జి ఓస్ రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ లెజెండరీ లీడర్ అలపర్తి విద్యాసాగర్ పాల్గొని సమస్యలపై సుదీర్ఘ చర్చలు జరిపి రావలసిన డిమాండ్స్ సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

**12వ పిఆర్సి నియామకానికి అంగీకారం**

రెండు డిఎలు 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లింపు. 1-7-2024, 1-1-2025 డీఏలు విడుదల. 2022 సంవత్సరానికి సంబంధించి సరెండర్ లీవ్స్ వచ్చే సంక్రాంతికి అకౌంట్ లో వేయడానికి అంగీకారం. పోలీసులకు ఒక అడిషనల్ సరెండర్ లీవ్ ఈ దసరాకి చెల్లింపు, అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ జనవరి-2027 నుంచి ఇచ్చేందుకు నిర్ణయం, 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింపు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్. వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కు చెల్లింపునకు అంగీకారం తదితర డిమాండ్స్ నెరవేర్చినందుకు గాను ముఖ్యమంత్రి కి మరియు డిమాండ్స్ సాధించిన ఏపీ యన్ జి జి ఓస్ రాష్ట్ర అధ్యక్షులు జేఏసీ చైర్మన్ లెజెండరీ లీడర్ అలపర్తి విద్యాసాగర్ కి, జనరల్ సెక్రటరీ కె యస్. ప్రసాదరావు కి, ప్రధాన సెక్రటరీ డివి.రమణ కి, కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులుకి మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్ కి తాలూకా అధ్యక్షులు, జెఏసి చైర్మెన్ రామసుబ్బయ్య యాదవ్ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, కోశాధికారి సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్స్ నాగార్జున, వరప్రసాద్, జాయింట్ సెక్రెటరీస్ , సుబ్బారాయుడు, నారాయణరాజు,జెఏసి కో చైర్మెన్స్ కంబగిరి శశికిరణ్, గోపాల్,ఓంకార్ ,మహేశ్వరయ్య, పెన్షనర్స్ నాగన్న, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# ఎన్నికలు, వినాయక చవితిపై గ్రామసభలో అవగాహన

**- సీఐ ఎస్.కె చాంద్ బాషా**



**చెన్నూరు- సూర్య వాస్తవం :** చెన్నూరు మండలంలోని ఉప్పరపల్లి గ్రామాన్ని సందర్శించిన చెన్నూరు యూపీఎస్ ఇన్స్పెక్టర్ అనంతరం శివాలపల్లి గ్రామంలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రామసభ నిర్వహించి ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రానున్న వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. గ్రామ ప్రజలకు ఎన్నికల నియమాలు, ఓటు హక్కు వినియోగం, వినాయక ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

# చదువు.. నైపుణ్యం.. ఇక ఉద్యోగమే!

**- మైదుకూరులో సెప్టెంబరు 9న భారీ జాబ్‌మేళా**

**- ప్రముఖ కంపెనీల్లో వందలాది ఉద్యోగాలు.. రూ.42 వేల వరకు**

**మైదుకూరు- సూర్యవాస్తవం:** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భారీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. సెప్టెంబరు 9న బుధవారం ఉదయం 9 గంటలకు బద్వేల్ రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ దుగ్గి రెడ్డి ఓబుల్ రెడ్డి తెలిపారు. అరవింద ఫార్మా గ్రూప్, బీబీక్యూ సుశీల్ ఫౌండేషన్, గ్రీన్‌టెక్, టీమ్ లేసి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆర్బీఎల్ కార్డ్స్, డిక్సన్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, నవతా ట్రాన్స్‌పోర్ట్, ఎల్ఐసీ, కియా ఇండియా తదితర ప్రముఖ సంస్థలకు చెందిన ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

**10వ తరగతి నుంచి పీజీ వరకు..**

విద్యార్హతలను బట్టి అభ్యర్థులను వివిధ పోస్టులకు ఎంపిక చేయనున్నారు. కెమిస్ట్రీ, ఫుడ్ అండ్ బేవరేజ్, సేల్స్, అసెంబ్లింగ్, క్వాలిటీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్, క్లీనర్స్ తదితర విభాగాల్లో ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు.

**రూ.42 వేల వరకు వేతనాలు**

ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.6 వేల నుంచి రూ.42 వేల వరకు వేతనాలు, స్టైపెండ్, ఇన్సెంటివ్‌లు, అలవెన్సులు లభించనున్నాయి. కొన్ని ఉద్యోగాలకు ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు.

**మహిళలకూ అవకాశాలు**

పోస్టును బట్టి పురుషులు, మహిళలు ఇద్దరూ దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయి. అభ్యర్థుల వయస్సు ఉద్యోగాన్ని బట్టి 18 నుంచి 45 సంవత్సరాల వరకు ఉండనుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంతో పాటు ఉచిత శిక్షణ, అప్రెంటిస్‌షిప్, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందాలని ప్రిన్సిపల్ దుగ్గి రెడ్డి ఓబుల్ రెడ్డి కోరారు.

# సిపిఎం వినతికి సానుకూలంగా స్పందించిన మారుతీ ఆసుపత్రి యాజమాన్యం

**- బాధిత కుటుంబానికి మారుతి హాస్పిటల్ వారు చేయూత**




**తిరుపతి-సూర్యవాస్తవం:** తిరుపతిలోని రిలయన్స్ మార్ట్ పక్కన ఉన్న మారుతీ ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబానికి అండగా సిపిఎం కలవడం జరిగింది . శ్రీకాళహస్తి మండలం రామానుజపల్లికి చెందిన 46 ఏళ్ల అన్నపూర్ణమ్మ 13 రోజుల క్రితం పాముకాటుకు గురై మారుతీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రైతు కుటుంబానికి చెందిన ఆమె భర్త శ్రీనివాసుల ఇప్పటికే కొంత డబ్బు కట్టి ఉన్నారు. శ్రీనివాస్ పేద రైతు కావడంతో చెల్లించాలని డబ్బును తగ్గించవలసిందిగా ఆసుపత్రి వారిని కోరడం జరిగింది .

సీపీఎం వారు కూడా చొరవ తీసుకుని మారుతి హాస్పిటల్ యాజమాన్యని సంప్రదించి బాధితుని కుటుంబం సిపిఎం అండగా నిలిచింది. బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం వారిని, ఆసుపత్రి యాజమాన్యం కోరగా,సానుకూలంగా స్పందించింది. బాధిత కుటుంబ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని చెల్లించాల్సిన మొత్తాన్ని రద్దు చేసి, అన్నపూర్ణమ్మను డిశ్చార్జ్ చేసేందుకు అంగీకరించింది. యాజమాన్యం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించినందుకు యాజమానయానికి అన్నపూర్ణనమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ, బాధిత కుటుంబం ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సిపిఎం సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిందన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన చేర్చాలకు యాజమాన్యం సానుకూలంగా స్పందించి కాటవలిసిన బిల్లు రద్దు చేయడం అభినందనీ యమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా ఆసుపత్రులు మానవతా దృక్పథంతో వ్యవహరించిన హాస్పిటల్ యాజమాన్యానికి సిపిఎం అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె. వేణుగోపాల్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు పి. సాయి లక్ష్మి, ఎం. నరేంద్ర, బి. పవిత్ర, జి. వాసు, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల, ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ నిర్ణయాలపై హర్షం

**- మైదుకూరు తాలూకా ఎపిఎన్‌జిజిఓ అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య**




**మైదుకూరు - సూర్య వాస్తవం :** గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులతో పాటు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని మైదుకూరు తాలూకా ఎపిఎన్‌జీజిఓ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల దీర్ఘకాలిక డిమాండ్లలో భాగంగా అదనపు క్వాంటమ్ పెన్షన్ పునరుద్ధరణ, అలాగే పిఆర్సి కమిటీ నియామకానికి ప్రభుత్వం అంగీకారం తెలపడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ బకాయిలను క్రమంగా పరిష్కరించడంతో పాటు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగుల్లో నమ్మకాన్ని పెంచుతున్నాయని చంద్రమౌళి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను గుర్తించి పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగడం స్వాగతించదగ్గ పరిణామమని, ఇదే స్ఫూర్తితో మిగిలిన పెండింగ్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని మైదుకూరు తాలూకా యూనిట్ సెక్రటరీ మాచనూరు రాఘవయ్య కోరారు. ఈ కార్య క్రమంలో అధ్యక్షులు గజ్జల చంద్రమౌళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య, ఉపాధ్యక్షులు రామ గుప్తా, సుజాత , సంయుక్త కార్యదర్శులు సుజాత, జనార్ధన్ రావు, మైదుకూరు తాలూకా ఎ పిఎన్ జీ జి ఓ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ పంచాయతీ సెక్రటరీ మృతి పట్ల ప్రముఖుల సంతాపం





**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని కొత్తూరు గ్రామానికి చెందిన తిప్పన సుబ్బరాయుడు (రిటైర్డ్ టీచర్) పెద్ద కుమారుడు, మాజీ పంచాయతీ సెక్రటరీ తిప్పన జయరామ నాయుడు (68) శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతివార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**నివాళులర్పించిన ప్రముఖులు:**

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ వేంకటాద్రి స్వామి, బి.మఠం ఎంపీపీ సి. వీరనారాయణరెడ్డి,జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జునరెడ్డి,మండల టీడీపీ నాయకులు ఎస్.ఆర్. శ్రీనివాసులరెడ్డి,ముడుమాల పోల్ రెడ్డి,సొసైటీ ప్రెసిడెంట్ సాంబశివారెడ్డి, చెంచయ్యగారిపల్లె జయరాంరెడ్డి, మల్లేపల్లి సుధాకర్,మండల టీడీపీ ఉపాధ్యక్షుడు శీలం నర్సింహులు,శివ యాదవ్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే వైఎస్ఆర్సీపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మాజీ డైరెక్టర్ గొర్లవీటి సుబ్రహ్మణ్యం,మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్,జిల్లా ఆర్టీఐ వింగ్ జనరల్ సెక్రెటరీ బి.ఎస్. నారాయణరెడ్డి,మన్యం శంకర్ రెడ్డి,రాళ్లపాటి మస్తాన్,జోగయ్య,ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఏవో నరసయ్య, ఉపాధి హామీ మండల అధికారి హరికృష్ణ,పంచాయతీ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ఇన్చార్జి మాజీ ఎంపీడీవో మల్లికార్జున,దివంగత మఠాధిపతి కుమారులు వీరభద్రయ్య, వీరంబొట్లయ్య, దత్తాత్రేయ స్వామి తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఆదివారం జరిగిన అంతిమయాత్రలో స్థానికులు, బంధువులు, అభిమానులు, స్నేహితులు పెద్ద ఎత్తున పాల్గొని భూస్థాపిత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## ఇంటి అందం కోసం ఎస్ఎం ఇంటీరియర్

**- షేక్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ విఎస్ ముక్తియార్**

**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** ఇంటి అందం మరింత రెట్టింపు కొరకు ఎస్ ఎం ఇంటిరియర్ నెలకొల్పారు అని రాష్ట్ర షేక్ డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ వి.ఎస్ ముక్తియార్ అన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న ప్రతాప్ లాడ్జ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎం ఇంటిరియర్ మెటీరియల్ దుకాణాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణంలో ఏర్పాటు చేసిన ఇంటీరియర్ మెటీరియల్ పరిశీలించారు. ఇంటిని అందంగా ఏర్పాటు చేసుకోవాలంటే ఎస్ఎం ఇంటీరియర్ డిజైన్ అవసరమని విఎస్ ముక్తియార్ పేర్కొన్నారు. డబ్బు ఎంత సంపాదించినా తీసుకుని పోలేమని కనీసం మనం నివసించే ఇంటి ని అందంగా పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ఇంటీరియర్ మెటీరియల్ ఎస్ఎం ఇంటిరియరు దుకాణాన్ని ప్రారం భించినట్లు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రతి ఇంటి యజమాని ఈ దుకాణాన్ని సందర్శించి పలు రకాలైన ఆధునిక మెటీరియల్ గమనించి ఎంపిక చేసిన స్థలంలో అమర్చుకునేందుకు దుకాణం యజమానులే పూర్తిగా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రొద్దుటూరు ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఇంటిని ఇంటి పరిసరాలను అందంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దుకాణ యజమాని సర్దార్ మాట్లాడుతూ గత 15 ఏళ్ల నుండి ఇంటీరియర్ వ్యాపారాన్ని చేస్తున్నామని తెలిపారు. ప్రొద్దుటూరు ప్రజలకు మరింత అందుబాటు ధరలతో ఇంటీరియర్ మెటీరియల్ అందించాలన్న లక్ష్యంతో నూతనంగా దుకాణం ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ ఖాసిం అయూబ్ ఖాన్ మరియు పట్టణ మత పెద్దలు మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 .